నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

గిరిజన తండాల బీటీ రోడ్లకు నిధులు మంజూరు చేయండి : విప్ సునితామహేందర్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, జులై 28: ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాల మూలంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఆలేరు నియోజకవర్గంలోని పలు గిరిజన తండాలకు సంబంధించిన బీటీ రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి.

సంబంధిత గిరిజన తండా రోడ్ల నిర్మాణానికి ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తూ.. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ కు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు.

గురువారం హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ లో మంత్రిని ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. రోడ్ల దుస్థితి, సమస్యను సవివరంగా మంత్రికి విన్నవించడంతో నిధుల మంజూరుకు ఆమె సానుకూలంగా స్పందించారని విప్ గొంగిడి తెలిపారు.

హైదరాబాద్ శుక్రవారం 29-7-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 293 పేజీలు:6 వెల: రూ.1/-

డిమాండ్లు పరిష్కరించాల్సిందే.. మంత్రివర్గ ఉపసంఘం ఎదుట ఉద్యోగల సంఘాలు

అమరావతి, జులై 28: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు గతంలో ఒప్పుకున్న డిమాండ్లను పరిస్కరించాల్సిందే అని ఉద్యోగ సంఘాల నేతలు పట్టుబట్టారు.

గురువారం సాయంత్రం ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు మంత్రివర్గ ఉపసంఘంతో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరపున సజ్జల నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రి బొత్స సత్యనారాయణ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపసంఘానికి ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు తమ డిమాండ్లను మరోసారి వినిపించాయి. పీఆర్సీతోపాటు పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

ఉద్యోగులకు ఆరోగ్య పథకం లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురువుతున్నాయని, ఇవాల్టి చర్చల్లో ప్రధానంగా ఈహెచ్‌ఎస్‌పై ఫోకస్ పెట్టామని ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి తెలిపారు. దీనిపై సుదీర్ఘంగా చర్చించామని, ఆరోగ్య శాఖ అధికారులను సమావేశానికి పిలిపించి వారితో మాట్లాడారని చెప్పారు.

ఆరోగ్యశ్రీ కింద ఉన్న వ్యాధులను ఈహెచ్‌ఎస్ కిందకు తీసుకురావాలన్నది మా ప్రధాన డిమాండ్ కాగా, దానిపై త్వరతగతిన నిర్ణయం తీసుకుంటామని మంత్రివర్గ ఉపసంఘం హామీ ఇచ్చిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ ఉన్న దవాఖానలన్నింటిలో కూడా ఈహెచ్‌ఎస్ అమలయ్యేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశామన్నారు.

పీఆర్సీపై సుదీర్ఘంగా ఉద్యోగులతో మంత్రివర్గ ఉపసంఘం చర్చించింది. గతంలో హామీ ఇచ్చినట్లుగా అన్ని కార్యాలయాలు, సంస్థల్లో ఉద్యోగుల వయసును పెంచడాన్ని కూడా మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్లారు.

ఈ నెలాఖరుకు చాలా మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందే అవకాశం ఉన్నందున, త్వరగా చర్యలు తీసుకుని అందరికీ ఉపయోగపడేలా చూడాలని కూడా ఉద్యోగ సంఘాల నేతలు కోరారు. దీనిపై సీఎం జగన్‌తో చర్చించిన మీదట ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడేలా చూస్తామని హామీ ఇచ్చినట్లుగా తెలుస్తున్నది.

మంత్రివర్గ ఉపసంఘంతో జరిగిన చర్చల్లో ముఖ్యంగా జీపీఎఫ్ అకౌంట్ల నుంచి డబ్బు మాయం కావడం గురించి ప్రభుత్వాన్ని నిలదీశామని, అలాగే లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏ బకాయిలను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌రావు చెప్పారు.

వడ్డీ వ్యాపారి వేధింపులు మహిళ ఆత్మహత్యాయత్నం..

వరంగల్, జులై 28: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ మహిళ మట్టేవాడ పోలీసులను ఆశ్రయించింది. పోలీస్ స్టేషన్ లో పోలీసులు న్యాయం చేయకపోగా వడ్డీ వ్యాపారులకు వత్తాసు పలకడంతో పోలీసు స్టేషన్ లోనే పురుగుల మందు తాగి అఫ్రిన్ అనే మహిళ ఆత్మహత్య యత్నానికి పాల్పడింది.

చరిత్రలో నేటినిజం



కం॥ స్వరము ఘనమై యతుల అమరుగ
శృతి పక్షమున కూడి గాన ప్రాసస్వరములన్
చతురిమ లొప్పగ నా సరి - జనుల
సుమ శతకములు నందుకొనెడి "సతాప్ జలోటా"॥

(జులై 29 గాయకుడు అనూప్ జలోటా జననం...)

-రాధశ్రీ

సెల్: 9494481210



రాష్ట్రంలో మరో మూడు రోజులూ వానలు.. హెచ్చరించిన వాతావరణశాఖ

హైదరాబాద్, జులై 28: రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇవాళ ఉత్తర-దక్షిణ ద్రోణి.. ఉత్తర-దక్షిణ ఇంటీరియర్ కర్నాటక నుంచి ఇంటీరియర్ తమిళనాడు మీదుగా కొమరం వరకు సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుందని పేర్కొంది.

గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

శుక్రవారం ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. శనివారం పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని, పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

ఆగస్టు 4న పోలీస్ టవర్స్‌ను ప్రారంభించనున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్, జులై 28: తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రో సెంటర్‌ను ఆగస్టు 4వ తేదీన సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. బంజారా హిల్స్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ ప్రాజెక్టుతో అనుబంధం ఉన్న అన్ని శాఖలకు సిటీ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఓ మెమోను రిలీజ్ చేశారు. ప్రారంభోత్సవానికి ముందే పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను పూర్తి చేయాలని ఆయన కోరారు. చరిత్రాత్మక రీతిలో కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణం సాగుతోందని, అయితే లాజిస్టిక్స్, ప్లానింగ్, ఎగ్జిక్యూషన్‌కు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. కమాండ్ సెంటర్ ప్రారంభోత్సవాన్ని గ్రాండ్‌గా నిర్వహించాలని, దీని ద్వారా హైదరాబాద్ సిటీ పోలీస్ ప్రతిష్టను ఇనుమడింప చేయాలని ఆయన తన మెమోలో తెలిపారు.

పోలీసు శాఖలో ఉన్న వివిధ రకాల యూనిట్లు అన్నీ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఒకే వేదికగా పని చేయనున్నాయి. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పాపులర్‌గా పోలీస్ టవర్స్ అని పిలుస్తున్నారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఇన్‌స్టాల్ చేసిన సుమారు 9.25 లక్షల కెమెరాలను ఈ సెంటర్‌లో మానిటర్ చేయనున్నారు.

వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రోత్సాహం : మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, జులై 28: వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ ప్రోత్సహించే క్రమంలో గుజరాత్ రాష్ట్రం రాజ్ కోట్‌లోని శక్తిమాన్ ఇండస్ట్రీని మంత్రి నిరంజన్ రెడ్డి గారి నేతృత్వంలోని బృందం సందర్శించింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగునీటి రాకతో తెలంగాణ కూలీలంతా రైతులుగా మారారు. క్షేత్ర స్థాయిలో కూలీల కొరత తీవ్రంగా ఉన్నది. గత ఏడేళ్లలో తెలంగాణ రాష్ట్రానికి దేశంలోని 11 రాష్ట్రాల నుంచి వచ్చి వ్యవసాయ కూలీలుగా, వ్యవసాయ అనుబంధ రంగాలలో కూలీలుగా పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. యూపీ, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల నుంచి కూలీల రాక ఎక్కువగా ఉందన్నారు. వ్యవసాయంలో వీలైనంత తొందరగా రైతాంగాన్ని యాంత్రీకరణ వైపు మళ్లించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన పేర్కొన్నారు. మన దేశంలో చిన్న కమతాలకు అనుగుణంగా యాంత్రీకరణను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్‌కోట్‌లో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో చేస్తున్న వ్యవసాయ పరికరాలు, వేరుశెనగ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. రోబోటిక్ టెక్నాలజీతో వ్యవసాయ పరికరాలు తయారు చేస్తున్న శక్తిమాన్ కంపెనీ తెలంగాణలో యూనిట్ నెలకొల్పాలని ఆహ్వానించారు. ప్రభుత్వపరంగా అన్ని రకాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, అగ్రోస్ ఎండీ రాములు, అగ్రోస్ జీఎం రాజమౌళి తదితరులు ఉన్నారు. అంతకు ముందు ప్రముఖ జ్యోతిర్లింగం సోమనాథ్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు.

తెలంగాణలో రవాణా సౌకర్యాలు బేష్

825.2 శాతం పెరిగిన ఒలెక్ట్రా గ్రీన్ టెక్ నికర లాభం

- 640.4 శాతం పెరిగిన రెవెన్యూ

- ఈ త్రైమాసికంలో 169 ఎలక్ట్రిక్ బస్సుల డెలివరీ

- ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.వి. ప్రదీప్ ప్రశంశలు

ఖమ్మం, జులై 28: (నేటినిజం ప్రతినిధి): దేశంలో ప్రముఖ ఎలక్ట్రిక్ మొబిలిటీ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ స్టాండ్ అలోన్ ప్రాతిపదికన, జూన్ 30, 2022తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.304.7 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది.

ఇది గత ఏడాది జూన్ 30, 2021తో ముగిసిన త్రైమాసికంలో సాధించిన రూ.41.2 కోట్ల ఆదాయంతో పోల్చితే ఇది 640.4 శాతం అధికం. ఈ త్రైమాసికంలో ప్రధానంగా 169 ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేయడంతో గణనీయమైన ఆదాయ వృద్ధిని సాధించింది.

గత ఏడాది తొలి త్రైమాసికంలో కేవలం 11 బస్సులను మాత్రమే డెలివరి చేయగలిగింది. పూణేలో బస్సుల నిర్వహణ ద్వారా కూడా ప్రస్తుత త్రైమాసికంలో అధిక ఆదాయం నమోదైంది.

ఈ ఏడాది పన్ను తర్వాత లాభం 18.8 కోట్లకు పెరిగింది. గత సంవత్సరం తొలి త్రైమాసికంతో ఆర్జించిన రూ. 2.0 కోట్లతో పోల్చితే ఇది 825.2 శాతం అధికం. ఈబిఐటిడిఏ 8.7 కోట్ల నుండి 322.6 శాతం పెరిగి రూ.36.8 కోట్లకు చేరుకుంది.

పన్నుకు ముందు లాభం (పిబిటి) 799.9 శాతం పెరిగి రూ. 24.7 కోట్లుగా నమోదు అయింది. క్యూ -నీ-క్యూ ప్రాతిపదికన, ఆదాయం రూ.268.1 కోట్ల నుండి రూ.304.7 కోట్లకు పెరిగి, 13.6 శాతం వృద్ధి చెందింది. కాగా, కంపెనీ 7.7 శాతం వృద్ధితో రూ.18.8 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఎబైటిడా 18.7 శాతం వృద్ధిని నమోదు చేసింది.

ఈ-బస్ డివిజన్ 2022 జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో రూ.279.4 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. గత ఏడాది తొలి త్రైమాసికం ఆదాయం రూ. 23.4 కోట్లతో పోల్చితే ఇది 1096 శాతం ఎక్కువ.

ప్రధానంగా ఎలక్ట్రిక్ బస్సుల సరఫరా 11 బస్సుల నుంచి 169 బస్సులకు పెరిగిన కారణంగా ఈ పెరుగుదల సాధ్యమైంది. అలాగే పూణే బస్ కార్యకలాపాల నుండి అధిక నిర్వహణ ఆదాయం నమోదు అయింది.

ఇన్సులేటర్ డివిజన్ ఆదాయం రూ. 17.8 కోట్ల నుంచి రూ. 25.3 కోట్లకు పెరిగింది. దీంతో రెవెన్యూ 42 శాతం పెరుగుదలను నమోదు చేసింది. అధిక కస్టమర్ల క్లియరెన్స్‌ల కారణంగా ఆదాయంలో పెరుగుదల నమోదు అయింది.

ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.వి. ప్రదీప్ మాట్లాడుతూ, "మా అవిశ్రాంత ప్రయత్నాల ఫలితంగా అనుకూలమైన ఫలితాలు అందివచ్చాయన్నారు.

గత మూడు నెలల కాలంలో ఎలక్ట్రిక్ బస్సుల తయారీని వేగవంతం చేయడంతో పాటు డెలివరీలు రికార్డు స్థాయి 169కి పెరిగాయన్నారు.

ఈ ఊపును కొనసాగించి కొత్త పుంతలు తొక్కడానికి మరింతగా ప్రయత్నిస్తున్నామని, మేము వివిధ ఎస్టియులకు డెలివరీలను పెంచడంతో పాటు డెలివరీల షెడ్యూల్‌లను పూర్తి చేస్తామన్నారు.

ప్రజా రవాణాను పటిష్టపరిచేందుకు ప్రయాణికులకు మా సంస్థ బస్సుల ద్వారా నాణ్యమైన, విలాసవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందుకు ఎంతగానో సహకరిస్తుందని, ముఖ్యమంత్రి కేసిఆర్, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కి ధన్యవాదాలు తెలిపారు.

ఈ త్రైమాసిక పనితీరు నాకు మరింత బలపడాలనే విశ్వాసాన్ని ఇచ్చిందని, రానున్న త్రైమాసికాలలో కొత్త ఉత్పత్తి శ్రేణిని పరిచయం చేయడంతో పాటు మరిన్ని విభాగాల్లోకి ప్రవేశిస్తామని అన్నారు.

నాగారం అర్బన్ ఫారెస్ట్ పార్కును ప్రారంభించిన మంత్రులు

హైదరాబాద్, జులై 28: రాష్ట్ర మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, సబిత ఇంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో నాగారం అర్బన్ ఫారెస్ట్ పార్కును ప్రారంభించారు. అనంతరం ఎనిమిదో విడత హరితహారంలో భాగంగా మంత్రులు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా నగరాలకు, పట్టణాలకు దగ్గర్లో ఉండే రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో అర్బన్ లంగ్ స్పేస్‌లుగా అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మానసికోల్లాసంతో పాటు ఆహ్లాద కరమైన వాతావరణం అందించేందుకు హైదరాబాద్‌కు నలువైపులా వీటిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

అవుటర్ రింగ్ రోడ్డుకు 7 కిలోమీటర్ల దూరంలో మహేశ్వరం మండలం పెద్దపులి నాగారంలో 556. 69 హెక్టార్ల విస్తీర్ణంలో రూ.8.17 కోట్ల వ్యయంతో నాగారం అర్బన్ ఫారెస్ట్ పార్క్‌ను అభివృద్ధి చేశామన్నారు. ఎంట్రీ ప్లాజా, విజిటర్స్ పాత్వే, సఫారి ట్రాక్, గజేబో, వాచ్ టవర్, గ్యాప్ ప్లాంటేషన్, అటవీ ప్రాంతం అంతా రక్షణ గోడ (చైన్ లింక్ ఫెన్సింగ్, సీ త్రూ వాల్), బోర్ వెల్, పైప్ లైన్, ఇతర సౌకర్యాలను కల్పించామని తెలిపారు.

ప్రాజెక్టుల పనుల వేగం పెంచండి.. కేంద్రమంత్రులకు ఉపరాష్ట్రపతి సూచన

న్యూఢిల్లీ, జులై 28: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన వివిధ ప్రాజెక్టులను ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు సమీక్షించారు. గురువారం పార్లమెంటులో వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డిలతో ఉపరాష్ట్రపతి వేర్వేరుగా సమావేశమై ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన వివిధ పథకాల అమలు తీరును సమీక్షించారు. ఆయా పథకాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పీయూష్ గోయల్ తో జరిగిన సమావేశంలో జాతీయ పారిశ్రామిక కారిడార్ పథకంలో భాగంగా చేపడుతున్న విశాఖపట్టణం-చెన్నై పారిశ్రామిక కారిడార్ (వీసీఐసీ) పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రపంచ స్థాయి ఉత్పత్తులతో పోటీపడేలా భారతదేశంలోనూ పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈ పథకానికి కేంద్రం రూపకల్పన చేసిన సంగతి తెలిసిందే. హర్దీప్ సింగ్ పురితో జరిగిన సమావేశంలో కాకినాడలో ప్రతిపాదిత గ్రీన్ ఫీల్డ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులను పరిష్కరించి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ లో పీఎం ఆవాస్ యోజన పథకంలో భాగంగా నిర్మించాల్సిన వివిధ ప్రాజెక్టుల వివరాలు కనుక్కున్నారు. రాష్ట్రంలోని స్మార్ట్ సిటీల పురోగతి, అమృత్ పథకం అమలుతీరు తదితర అంశాల గురించి కూడా వెంకయ్య నాయుడు సమీక్ష జరిపారు. కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో వారసత్వ నగరాల పురోగతి, వివిధ పర్యాటక సర్క్యూట్ల స్థితిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కిషన్ రెడ్డికి ఉపరాష్ట్రపతి సూచించారు.

వర్షం నీటిలో కుర్చీలు పట్టుకున్న విద్యార్థులు- వాటిపై నడిచి స్కూలుకు వచ్చిన టీచర్

లక్నో, జులై 28: నీట మునిగిన స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులు వరుసగా కుర్చీలు వేసి వాటిని పట్టుకోగా ఒక టీచర్ వాటిపై నడిచి స్కూల్‌కు వచ్చింది. ఉత్తర ప్రదేశ్‌లోని మథుర జిల్లాలో ఈ సంఘటన జరిగింది. వర్షాల నేపథ్యంలో ఒక ప్రభుత్వ స్కూల్ ప్రాంగణమంతా నీటితో నిండింది. బుధవారం ఆ స్కూల్ విద్యార్థులు వర్షం నీటిలో నడుచుకుంటూ క్లాస్ రూమ్‌లకు చేరుకున్నారు. అయితే టీచర్లు మాత్రం అక్కడ ఏర్పాటు చేసిన కుర్చీలపై నడిచి వచ్చారు. వర్షం నీటితో నిండిన కాంపౌడ్‌లో వరుసగా పేర్చి విద్యార్థులు పట్టుకున్న కుర్చీల మీదుగా ఒక ఉపాధ్యాయురాలు నడుచుకుంటూ స్కూల్‌లోకి ప్రవేశించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇది అధికారుల దృష్టికి వెళ్లగా ఆ టీచర్‌ను సస్పెండ్ చేశారు.

మరోవైపు యూపీలో జరిగిన మరో సంఘటనలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు క్లాస్ రూమ్‌లోనే విద్యార్థితో మసాజ్ చేయించుకుంది. హర్దోయ్‌లోని పోఖరి ప్రైమరీ స్కూల్‌లో ఈ ఘటన జరిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో విద్యార్థితో మసాజ్ చేయించుకున్న మహిళా టీచర్ ఉర్మిళా సింగ్‌ను అధికారులు సస్పెండ్ చేశారు.



డీహైడ్రేషన్‌కు అమృత ఔషధం ఓఆర్‌యస్ మిశ్రమం

(29 జూలై 'ప్రపంచ ఓఆర్‌యస్ దినం' సందర్భంగా)

ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం ఐదేండ్ల లోపు వయసున్న పిల్లల మరణాలకు కారణమైన రెండవ అతి పెద్ద వ్యాధిగా 'అతిసారం లేదా నీళ్ల విరోచనాలు లేదా డయేరియా'ను గుర్తించారని తెలుస్తున్నది. పరిసరాల, వ్యక్తిగత అపరిశుభ్రతల వల్ల ప్రమాదకర అతిసార వ్యాధి సోకుతుంది. డయేరియాతో శరీర ద్రవాలు, లవణాలతో పాటు నీటి శాతం తగ్గుతూ, డీహైడ్రేషన్ (నిర్జలీకరణం) కలుగుతుంది. ఇలాంటి డీహైడ్రేషన్‌ను అశ్రద్ధ చేసినపుడు పిల్లల్లో ప్రాణాంతకంగా మారుతుంది. డీహైడ్రేషన్ లేదా అతిసార వ్యాధి తీవ్రతను గుర్తించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏట 29 జూలై రోజున 'ప్రపంచ ఓఆర్‌యస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్) దినం' పాటించుట జరుగుతున్నది. అతిసార వ్యాధికి చవకైన ఔషధ విరుగుడుగా 'నోటి పునర్జలీకరణ ద్రావణం లేదా ఓఆర్‌యస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్)'ను వాడడం మరువరాదు. ఓఆర్‌యస్ మిశ్రమంలో పిండి పదార్థాలు, ఉప్పు ప్రధాన సంఘటనాలుగా ఉంటాయి. ఇలాంటి ఓఆర్‌యస్ మిశ్రమాన్ని బాలలకు 'డీహైడ్రేషన్‌కు అమృతఔషధం'గా పరిగణిస్తారు. భారత్‌లో 3వ అతి పెద్ద వ్యాధిగా 13 శాతం పిల్లల మరణాలకు డయేరియా కారణమవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట 1.7 బిలియన్ పిల్లలు డయేరియాతో బాధ పడడం, 5.25 లక్షల మరణాలు సంభవించడం గమనించారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అతిసార సమస్య అతి తీవ్రంగా కనిపిస్తున్నది.

ఐదేండ్ల లేపు పిల్లలకు ప్రాణాంతకంగా మారుతున్న డయేరియా లేదా నీళ్ల విరోచనాలకు చక్కటి ఔషధంగా 'ఓఆర్‌యస్' ద్రావణం ఉపయోగపడుతుంది. శరీరంలోని సోడియం, క్లోరైడ్, పొటాషియం, బైకార్బొనేట్స్‌తో పాటు శరీర ద్రవాలు, ముఖ్యంగా నీటిని వాంతులు లేదా విరోచనాల రూపంలో కోల్పోయిన శరీరం వెంటనే ప్రమాదకరంగా మారుతుంది. ఈ అనారోగ్యాన్ని గమనించిన వెంటనే 'ఓఆర్‌యస్'ను నీటిలో కలిపి తరుచుగా తాగించడంతో అతిసారం నయమైపోతుంది. ఔషధ దుకాణాల్లో ఓఆర్‌యస్ ప్యాకెట్లు లభిస్తున్నప్పటికీ, ఇంట్లో ఉన్న టీ స్పూన్ చక్కర, చిటికెడు ఉప్పులను గ్లాసులోని 200 యంయల్ నీటిలో కరిగించి ఆ ద్రావణాన్ని తయారు చేసుకొని తాగించాలి. పెద్దలు ఓఆర్‌యస్ ద్రావణాన్ని నేరుగా తాగవచ్చు, కాని పిల్లలకు ఈ ద్రావణాన్ని చెమ్చాతో తాగించాలి. వాణిజ్య ఓఆర్‌యస్ మిశ్రమంలో ఉప్పు, ట్రైసోడియం సిట్రేట్, డీహైడ్రేట్, పొటాషియం క్లోరైడ్, షుగర్ ఉంటాయి.

ఆరోగ్యవంతమైన శరీరం 24 గంటల్లో పలు లీటర్ల నీటిని గ్రహించడం, కోల్పోవడం జరుగుతుంది. సార్వత్రిక ద్రావణిగా శరీర భాగాలకు ఖనిజ లవణాలను, పోషకాలను సరఫరా చేయటంలో నీరు ప్రధాన భూమికను నిర్వహిస్తుందని మనకు తెలుసు. విరోచనాలు, వాంతులతో శరీరం నీటిని కోల్పోయినపుడు, నీటితో పాటు సోడియం, క్లోరైడ్, పొటాషియంలను కోల్పోయి, ప్రమాదకర పరిస్థితులకు దారి తీస్తుంది. చవకైన, నోటి ద్వారా అందించగల ఓఆర్‌యస్ ఔషధం డాక్టర్‌ను సంప్రదించకుండానే అందరూ ఎల్లవేళల వాడవచ్చు. ఓఆర్‌యస్ వాడిన క్షణాల్లోనే వ్యక్తికి ఉపశమనం కలుగుతుంది. ప్రపంచ ఓఆర్‌యస్ దినం రోజున సాధారణ ప్రజలకు అవగాహన కల్పించడం, తయారు చేసే విధానాన్ని చేసి చూపించడం, వాడే పద్ధతులను వివరించడం చేయాలి. డీహైడ్రేషన్ సమస్యకు ఓఆర్‌యస్ అమృతఔషధాన్ని బహుళ ప్రచారంలోకి తేవలసి[illegible]ద్యత విద్యావంతులు, వైద్య విభాగాల మీద ఉందని గమనించాలి.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

రెండో డోసు వేసుకుని.. 90రోజులు పూర్తయిన వారికి బూస్టర్ డోస్

హైదరాబాద్, జులై 28: మణికొండ పురపాలక సంఘం పరిధిలో ఈనెల 25 నుండి 13-09-2022 వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు మణికొండ మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

కోవిడ్ వ్యాక్సినేషన్ 2 డోసులు వేసుకొని 90 రోజులు పూర్తయిన వారికి బూస్టర్ డోస్ వ్యాక్సినేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వ్యాక్సినేషన్ డ్రైవ్ తేదీలు, స్థలముల కాపీ జతచేయడం జరిగిందన్నారు. వార్డుల వారిగా అధికారులు బూస్టర్ డోస్ వేసేందుకు అందుబాటు-లో ఉంటారని తెలిపారు.

భరోసా సెంటర్‌గా మారిన బొమ్మెర రెసిడెన్సి

ఖమ్మం, జులై 28: (నేటినిజం ప్రతినిధి): బొమ్మెర రామ్మూర్తి వద్దకు వెళితే మా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని నమ్మి పార్టీలకు, కులాలకు, మతాలకు, అతీతంగా రోజు పదుల సంఖ్యలో ఇంటికి వచ్చి పోయే వారికి భరోసాను కల్పిస్తూ అవసరమైతే వచ్చిన వారి కోసం ఎక్కడికైనా వెళ్లి సమస్యను పరిష్కరించే తత్వం ఉన్న వ్యక్తి టిఆర్ఎస్ పార్టీ ఫౌండర్ మెంబర్, మధిర నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ బొమ్మెర రామ్మూర్తి, ముఖ్యంగా మధిర నియోజకవర్గ నుండి ప్రతి గ్రామం నుండి వచ్చిన వారి సమస్యలు విని పరిష్కారం చూపెడుతూ పేద ప్రజల నాయకుడిగా భరోసాను కల్పించే వ్యక్తిగా సమస్యల పరిష్కారం కోసం ఎంత దూరమైనా వెళ్లే వ్యక్తిగా ముద్ర వేసుకున్న నాయకుడు "బొమ్మెర "ఎంతో ఆప్యాయంగా వచ్చిన వారిని మంచి చెడు చూసి ఎంతో సహనంతో చెప్పిన ప్రతి విషయాన్ని విని అది పోలీస్ స్టేషన్ అయినా, ఎమ్మార్వో ఆఫీస్ అయినా, ఆర్డీవో ఆఫీస్ అయినా, కలెక్టర్ ఆఫీస్ అయినా, హాస్పటల్, స్కూల్, కాలేజీ అవసరం ఏదైనా స్వయంగా వెళ్లి వారి పని చేసి పెట్టే గొప్ప నాయకుడు "మన బొమ్మరన్న" వచ్చిన వారికి భోజన సదుపాయం కల్పించి వారి ఆకలి తీర్చే గొప్ప వ్యక్తిత్వం ఉన్న నేటి తరం నాయకుడు "బొమ్మెర రామ్మూర్తి" అందుకే అందరూ అంటున్నారు. భరోసా సెంటర్ గా మారిన "బొమ్మెర రెసిడెన్సి" ఇలాంటి నాయకుడు ఈ సమాజానికి అవసరం అని కొనియాడారు.

ఆహ్వానం
45 కన్నుల
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయగానసభ
సంయుక్త ఆధ్వర్యంలో
జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
డా॥ సి. నారాయణ రెడ్డిగారి
91వ జయంతి సందర్భంగా

చారిత్రక నవలా చక్రవర్తి
ఆచార్య ముదిగొండ శివప్రసాద్‌గారికి
సినారె-సాహితీ
పురస్కారం-బహూకరణ
శనివారం 30-07-2022 సా॥ 6 గంటలకు
కళా సుబ్బారావు కళావేదిక,
శ్రీ త్యాగరాయగానసభ, చిక్కడపల్లి

ముఖ్యఅతిథి : జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి, పూర్వ ప్రధాన న్యాయమూర్తి, పాట్నా హైకోర్టు
సభాధ్యక్షులు : డా॥ వోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీవేత్త
విశిష్ట అతిథి : శ్రీ కళా జనార్దనమూర్తి, అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
గౌరవ అతిథి : డా॥ అక్కిరాజు సుందర రామ కృష్ణ, ప్రముఖ రంగస్థ, సినీ నటులు
ఆత్మీయ అతిథులు : శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటినిజం
డా॥వి. భాస్కర్ రాజు, ఎం.ఎస్. ఆర్థోపెడిక్ సర్జన్, 'ధర్మమార్గం' టి.వి. ఛానల్ అధిపతి

సా॥ 7-30 గంటల నుండి
సినీ విజ్ఞానవిశారద శ్రీ ఎస్.వి. రామారావు రూపొందించిన
'సాహితీ సవ్యసాచి సినారె' లఘు చిత్రం ప్రదర్శన

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐపిఎస్. (ర) అధ్యక్షులు, కిన్నెర
మద్దాళి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర
కళాశారద కార్యదర్శి, శ్రీ త్యాగరాయగానసభ

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న టీఎస్ ఆర్టీసీ -ఎండీ. వీసీ.సజ్జనార్

హైదరాబాద్, జులై 28: ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు టీఎస్ ఆర్టీసీ అన్ని ప్రయత్నాలను ముమ్మరం చేసింది. మారుతున్న కాలానుగుణంగా ప్రయాణికులను ఆకట్టుకునేందుకు సాంకేతికతను ఉపయోగించు కుంటోంది. బస్సు ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడంతో పాటు టీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా ప్రోత్సహించడానికి సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే, వీసీ అండ్ ఎండీ వీసీ.సజ్జనార్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 96 డిపోలు, 4170 ప్రత్యేక రకం బస్సులను బస్ ట్రాకింగ్ అమలుకోసం, ప్రయాణీకుల సౌకర్యార్థం టీఎస్ ఆర్టీసీ బస్సు సర్వీసుల బస్టాపులకు చేరుకునే కచ్చితమైన సమయాలను తెలుసుకోవడానికి ట్రాకింగ్ వ్యవస్థను అందుబాటు లోకి తీసుకొచ్చారు. దీంతో ప్రయాణీకులు తాము ప్రయాణించాల్సిన బస్సు ఎక్కడ ఉందో అరచేతిలో చూసుకునే సదుపాయం ఏర్పడింది. ఈ మేరకు టీఎస్ ఆర్టీసీ బస్‌ట్రాకింగ్ పేరుతో గూగుల్ ప్లే స్టోర్‌లో మొబైల్ యాప్‌ని సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ.సజ్జనార్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందుబాటు లో ఉన్న టీఎస్ ఆర్టీసీ రవాణా సేవలు, తెలంగాణ, సమీప రాష్ట్రాల్లోని వివిధ బస్టాప్‌ల్లో బస్సుల ఆగమనం, నిష్క్రమణంలను తెలుసుకోవడానికి ప్రయాణీకులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటు-ందన్నారు. ఈ విధానం ద్వారా ప్రయాణీకులు బస్టాప్‌లు, బస్ స్టేషన్లలో నిరీక్షణ సమయాన్ని నివారించడానికి వారి ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవడానికి దోహదపడుతుందన్నారు. ప్రయోగాత్మకంగా 140బస్సులను గుర్తించామని, వీటిలో కంటోన్మెంట్, మియాపూర్-2 డిపోలకు చెందిన 40 ఏసీ పుష్పక్ బస్సులను వివిధ మార్గాల్లో శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంకు, సుదూర ప్రాంతాలకు మియాపూర్-1 డిపోకు చెందిన 100 బస్సులను నడుపుతున్నట్లు- ఎం.డి వెల్లడించారు.

శ్రీశైలం, విజయవాడ, ఏలూరు, భద్రాచలం, విశాఖపట్నం వంటి రూట్లలో నిర్వహిస్తున్న పీకేటీ- డిపోలను ప్రస్తుతం ట్రాక్ నడుస్తుందని, మరో రెండు నెలల్లో జిల్లాలతో పాటు హైదరాబాద్ నగరంలో అన్ని రిజర్వేషన్ సేవలు, ప్రత్యేక తరహా సేవలను కూడా ట్రాకింగ్ యాప్‌లో చేర్చనున్నట్లు తెలిపారు. టీఎస్ ఆర్టీసీ బస్ ట్రాకింగ్ యాప్‌లో ప్రయాణీకులు తమ ప్రదేశానికి సమీపంలో ఉన్న బస్టాప్ వద్ద బస్సు రాక గురించి ఖచ్చితమైన సమాచారాన్ని అందించడం జరుగుతుందన్నారు. విమానాశ్రయం లేదా రైల్వే స్టేషన్‌లకు కనెక్ట్ చేయడం ద్వారా వారి ప్రయాణ ప్రణాళికకు మెరుగైన సమన్వయాన్ని అందిస్తుందన్నారు. హైదరాబాద్ సిటీ-, డిస్ట్రిక్ట్ సర్వీస్‌లలో వేర్వేరుగా బస్సులను ట్రాకింగ్ చేయవచ్చని, మూలం, గమ్యస్థాన పాయింట్ల కోసం ఆశించిన రాక సమయాన్ని కచ్చితంగా తెలుసుకోవచ్చన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం 24/7 నడిచే రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, ఎలక్ట్రిక్ బస్సుల (పుష్పక్) కోసం ఎంతో సౌలభ్యంగా ఉంటు-ందన్నారు. జిల్లాలోని గరుడ ప్లస్, రాజధాని, సూపర్ లగ్జరీ, డీలక్స్ అండ్ ఎక్స్‌ప్రెస్ బస్సుల వంటి ప్రత్యేక రకాల సేవల కోసం స్థలాలు, స్టేజీల మధ్య బస్సు సర్వీసుల సమాచారం సులభంగా ట్రాకింగ్ చేయవచ్చన్నారు. హైదరాబాద్ సిటీ-లో పుష్పక్ (విమానాశ్రయ సేవలు), మెట్రో లగ్జరీ, మెట్రో డీలక్స్ అండ్ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల వంటి ప్రత్యేక రకాల సేవల కోసం శోధించవచ్చన్నారు. బస్సు నెంబర్ ద్వారా చేరుకునే సమయాన్ని తెలుసుకోవడానికి సౌలభ్యం ఏర్పడుతుందని చెప్పారు. యాప్‌లో ప్రస్తుత లొకేషన్, సమీప బస్టాప్‌ను వీక్షించి ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవచ్చన్నారు. టి.ఎస్.ఆర్.టి.సి నుంచి మహిళా హెల్ప్‌లైన్, ఫ్రీక్‌డౌన్‌లతో పాటు- ప్రమాదాలు ఏవైనా ఉంటే నివేదించడం వంటి అత్యవసర సేవలను ఉపయోగించుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రయాణికులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, యాప్‌లో మరిన్ని మెరుగుదలల కోసం వారి విలువైన సూచనలను అందించాలని వి.సి అండ్ ఎం.డి అభ్యర్థించారు. ప్రయాణికులు కండక్టర్, డ్రైవర్ ప్రవర్తన, బస్సు పరిస్థితి, డ్రైవింగ్‌పై తమ అభిప్రాయాన్ని అందించవచ్చన్నారు. టీఎస్ ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీ-ఎస్ఆర్టీసీ.తెలంగాణ.జీఓవీ.ఇన్ లో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి లింక్ కూడా అందించబడిందని ఆయన

చెట్టుకిందే మంత్రి - ప్రజలతో మాటా మంతీ

-సింగరాజుపల్లిని మండల కేంద్రం చేయండి!
-మంత్రిని కలిసి విన్నవించిన ఆయా గ్రామాల ప్రతినిధులు

జనగామ, జులై 28: : నిత్యం జనంలోనే, జనంతోనే ఉండే మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, తన స్థాయి, స్థానం కోసం ఏనాడూ చూడరు. ఎక్కడ ఎలా అయినా సరే, జనంతో ఉండటమే ముఖ్యమనుకుంటారు.

అలా అనేక సందర్భాల్లో ప్రవర్తించిన మంత్రి మరోసారి తన రూటే సెపరేటని నిరూపించారు. తాజాగా, పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో మాజీ రాష్ట్ర పతి అబ్దుల్ కలామ్ విగ్రహావిష్కరణకు వెళుతూ జనగామ జిల్లా లింగాల ఘన్‌పూర్ మండలం కుందారం (పటేల్ గూడెం) క్రాస్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నియోజకవర్గంలోని సింగరాజుపల్లి, ఆ చుట్టు ముట్టు గ్రామాలకు చెందిన పలువురు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆ పక్కనే ఉన్న చిన్న గుడిసె హోటల్ ముందు ఆగారు. అక్కడే ప్రయాణీకుల కోసం వేసి ఉన్న ఓ చైర్ మీద కూర్చున్నారు. వాళ్ళతో కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు సింగరాజుపల్లి చుట్టు ముట్టు గ్రామాలను కలిపి మండల కేంద్రం చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అందుకు మంత్రి పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసి వారిలో దేవరుప్పుల పిఎసిఎస్ చైర్మన్ లింగాల రమేశ్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కత్తుల విజయ్, పెద్ద మడూరు సర్పంచ్ పెద్దారెడ్డి, సింగరాజుపల్లి సర్పంచ్ మల్లేశ్, నేల పోగుల సర్పంచ్ దూసరి గణపతి, చిన్నమడూరు ఎంపీటీసీ మల్లికార్జున్, ధరావత్ తండా సర్పంచ్ గేమా, నల్లకుంట తండా సర్పంచ్ రాజన్న, టిఆర్ఎస్ పార్టీ మండల శాఖ ఉపాధ్యక్షుడు ఉమేశ్, పార్టీ సినియర్ నాయకులు సంజీవరెడ్డి, భిక్షపతి, బండి సర్సింహులు, మేడ వెంకటేశ్, జోగు సోమరాజు, వంగ అర్జున్ తదితరులు ఉన్నారు.

దోషులకు శిక్ష పడేలా చేయడమే లక్ష్యంగా పోలీస్ కమిషనర్



ఖమ్మం, జులై 28: (నేటినిజం ప్రతినిధి): నేరస్థులను చట్టం ముందు నిలబెట్టి శిక్ష పడేలా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ అన్నారు.

నెలవారీ నేర సమీక్ష సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ..నిర్ణీత కాలంలో ఎఫ్ఐఆర్ నమోదు నుండి నిందితుల అరెస్టు, దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు వరకు లోతుగా అధ్యయనం చేయడం, నేరస్థులు తప్పించుకోకుండా ఎప్పటికప్పుడు సమీక్షించి దోషులకు శిక్షలు పడేలా పకడ్బంది చర్యలు తీసుకొవాలన్నారు

నేర నిరుపణ, శిక్ష ఖరారు (కన్విక్షన్ రెటు) తగ్గినప్పుడు అది సమాజంలోని ప్రజల భద్రత, రక్షణపై ప్రభావితం చూపుతుందనే విషయాన్ని పోలీస్ అధికారులు గ్రహించాలని స్పష్టం చేశారు.

ఇప్పటికే జిల్లాలో సుమారు 60 శాతానికి పైగా శిక్ష ఖరారు శాతం వుందని మరింత మెరుగైన పురోగతి కోసం అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధ్యమైనంత వరకు సద్వినియోగం చేసుకొని తక్కువ సమయంలో చట్టప్రకారం నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని సూచించారు. ప్రధానంగా కోర్టుల్లో కేసులు పెండింగులో లేకుండా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మరియు న్యాయమూర్తుల ఆదేశాలను అనుసరిస్తూ నిర్దిష్టమైన ప్రణాళికతో సాక్షులను, నిందితులను సకాలంలో కోర్టుకు హాజరుపరిచేందుకు కృషి చేయాలన్నారు.

జిల్లాలోని ఏ పోలీస్ స్టేషన్ కు వెళ్లిన ఒకేవిధమైన స్పందన, ఏకీకృత సేవలను విస్తరింపజేయడం లక్ష్యంగా అమలవుతున్న ఫంక్షనల్ వర్టికల్స్ ద్వారా పోలీస్ శాఖలో పని చేస్తున్న ప్రతిఒక్కరికి పని విభజన చేసి ఖచ్చితమైన బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. ఈసందర్భంగా రిసెప్షన్ స్టాప్, స్టేషన్ రైటర్స్, క్రైమ్ రైటర్స్, బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్, సెక్షన్ ఇంచార్జ్, టెక్నికల్ టీమ్, క్రైమ్ స్టాప్ తదితర 14ఫంక్షనల్ వర్టికల్స్ అమలు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

పోక్సో యాక్ట్, క్రైమ్ ఎగినెస్ట్ ఉమెన్, ఎస్సీ ఎస్టీ, గ్రేవ్ కేసులపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ వుండాలని సూచించారు.

జిల్లాలోని ఏసీపీలు తమ పరిధిలోని సిఐలు, ఎస్ హెచ్ వోలతో ఎప్పటికపుడు కేసులపై సమీక్షించి పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు.

పెండింగ్ లో వున్న కేసులు, ఇప్పటివరకు నమోదు అయిన కేసులపై పోలీస్ కమిషనర్ సమీక్షించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని భద్రత పరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. రహదారులపై జరిగే ప్రమాదాల హాట్‌స్పాట్ ప్రాంతాలను నిరంతరం సందర్శిస్తూ.. ప్రమాదాలు జరిగే ప్రదేశాలను సంబంధిత శాఖలతో సంప్రదించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు.

బాలుర హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్.. ఏడుగురు విద్యార్థులకు అస్వస్థత

మహబూబాబాద్, జులై 28 (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహంలో ఏడుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. బాలుర వసతి గృహంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు రోజువారిలా ఆహారం సేవించి పాఠశాలకు వెళ్లగా మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం ఫుడ్ పాయిజన్ అయిందని దాంతో ఒక్కసారిగా కడుపులో నొప్పి.. విరేచనాలు అవడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోకి వెళ్లి వైద్యం చేయించుకోవడం జరిగిందని విద్యార్థులు రామ్ చరణ్, బబ్లులతో పాటు తదితర విద్యార్థులు తెలిపారు. బియ్యం సరిగా లేనందువల్ల వర్కర్లు అన్నం ముద్దముద్దగా వండడంతో ఆ అన్నం తినడం వల్ల కడుపులో నొప్పి రావడం జరిగిందని విద్యార్థులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న వసతిగృహ అధికారి ఈసం స్వామి విద్యార్థులను ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలు అందిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన గురై తమ పిల్లలను ఇంటికి తీసుకెళుతున్నట్లు సమాచారం. ? విషయమై వసతిగృహ అధికారి ఈసం స్వామిని వివరణ కోరగా.. బియ్యం మంచిగా లేనందువలనే ఈ సంఘటన చోటు చేసుకుందని.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు.

పెండింగ్ కేసుల్లో పురోగతి సాధించాలి: డిజిపి మహేందర్ రెడ్డి

– నిర్దిష్టమైన ప్రణాళిక, సమిష్టి కృషితో పెండింగ్ కేసుల్లో పురోగతి సాధించారని రాష్ట్ర డీజీపీ యం. మహేందర్ రెడ్డి అన్నారు
– నెలవారీ ఆన్‌లైన్ నేర సమీక్షలో భాగంగా గురువారం పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఏస్పీలతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ పాల్గొన్నారు

ఖమ్మం, జులై 28: (నేటినిజం ప్రతినిధి): పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ...కొత్తగా ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ క్రైమ్ ఎగినెస్ట్ ఉమెన్, పోక్సో, ఎస్సీ ఎస్టీ కేసులపై పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని అయ కేసుల్లో నేరానికి సంబంధించి ఆధారాలు సేకరించి నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో పోలీస్ అధికారులు ఉత్తమ పనితీరు కనబరిచారని స్పష్టం చేశారు.

నేర పరిశోధన, కేసుల దర్యాప్తు, నిందుతుల అరెస్ట్, చార్జ్ షీట్ సమయంలో మరింత నాణ్యత ప్రమాణాలు పాటించేలా పై అధికారులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు.

నేర నిరూపణలో కీలక పాత్ర పోషించే దర్యాప్తు అధికారి ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్, ప్లాన్ ఆఫ్ యాక్షన్ వుండాలని అన్నారు.

కోర్టు మానిటరింగ్ సిస్టమ్ ద్వారా పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ సమన్వయం చేసుకుంటూ.. సాక్ష్యాలను సకాలంలో న్యాయస్థానంలో ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడేలా చేయాలని సూచించారు. షీటీమ్, హెచ్ఆర్ఏంఎస్, సైబర్ నేరాలపై పోలీస్ అధికారులు తరచూ రివ్యూ నిర్వహించాలని సూచించారు.

ఏ పోలీస్ స్టేషన్ కెళ్లిన ఒకేవిధమైన స్పందన, ఏకీకృత సేవలు అందిస్తూ పారదర్శకతను విస్తరింపజేయడం లక్ష్యంగా అమలవుతున్న ఫంక్షనల్ వర్టికల్స్ అమలు తీరును సమీక్షించారు.

సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శబరిష్, అడిషనల్ డీసీపీ లాఅండర్ సుభాష్ చంద్ర బోస్, ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏసీపీలు రామోజీ రమేష్, వెంకటస్వామి, అంజనేయులు, రహెమాన్, రవి, బాబురావు, పాల్గొన్నారు.

ఎన్టీపీసీ రామగుండం లో "బిజ్లీ మహోత్సవ్"

న్యూఢిల్లీ, జులై 28: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ఉత్సవాలలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో "ఉజ్వల్ భారత్ ఉజ్వల్ భవిష్య-విద్యుత్ఏ2047" ఇతివృత్తం లో భాగంగా "బిజ్లీ మహోత్సవ్" వేడుకలను దేశ వ్యాప్తంగా 773 జిల్లాలలో జూలై 25 నుంచి జూలై 30 వరకు జరపనున్నారు.

దేశవ్యాప్తంగా విద్యుత్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో సాధించిన విజయాలను ప్రదర్శించేందుకు ఎన్టీపీసీ రామగుండం ఎంప్లాయీ డెవలప్మెంట్ సెంటర్ (ఈడీసీ) ఆడిటోరియంలో ఈ రోజు 'ఉజ్వల్ భారత్, ఉజ్వల్ భవిష్య' వేడుకలను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా సార్వత్రిక గృహ విద్యుదీకరణ(ఆర్ఈసీ), గ్రామాల విద్యుదీకరణ, పంపిణీ వ్యవస్థ బలోపేతం, సామర్థ్య జోడింపు, వన్ నేషన్ వన్ గ్రిడ్, పునరుత్పాదక శక్తి, వినియోగదారు హక్కులు అనే అంశాలపై లఘు చిత్రాలను ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ శ్రీ డా. అనిల్ కుమార్ తో పాటు మునిసిపల్ కమిషనర్ శ్రీ బి.సుమన్ రావు, శ్రీ అతుల్ కమలాకర్ దేశాయ్, జిఎమ్ (ఓ అండ్ ఎం) లు పాల్గొన్నారు.

ఎంజిఎన్ఆర్ఈజిఏ సిబ్బంది హాజరు విధానంలో మార్పు

న్యూఢిల్లీ, జులై 28: రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఈజిఏ) మరింత పారదర్శకంగా అమలు జరిగేలా చూసేందుకు సిబ్బంది హాజరును పని జరుగుతున్న ప్రాంతంలో 2021 మే 21వ తేదీ నుంచి జియో–ట్యాగ్ చేయబడిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) యాప్ సహాయంతో సమయం ముద్రించే ఫోటో తో సహా రోజుకు ఒకసారి తీసుకోవడం జరుగుతున్నది. 20 లేదా అంతకు మించి ఉన్న కార్మికులకు ఈ విధానం అమలు జరుగుతున్నది. దీనివల్ల పథకంలో ప్రజల భాగస్వామ్యం పెరిగి పనులు అమలు జరుగుతున్న తీరును ప్రజలు గమనించేందుకు అవకాశం కలగడమే కాకుండా చెల్లింపులు కూడా వేగంగా జరుగుతాయి.

రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి అందిన సలహాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని 20 లేదా అంతకు మించి లబ్ధిదారులు పనిచేస్తున్న ప్రాంతాలలో సిబ్బంది హాజరును 16.05.2022 నుంచి ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మాత్రమే తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

పనిచేస్తున్న మహిళలు ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా ప్రతి ఒక్కరి హాజరును తీసుకొనేలా ప్రోత్సహించడం జరుగుతుంది. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు కోరిన నాటి నుంచి ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేసే విధానాన్ని అమలు చేసేందుకు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు మంత్రిత్వ శాఖ శిక్షణ ఇస్తుంది. ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు ఎన్ఐసి సహకారంతో పరిష్కరించడం జరుగుతుంది. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి అందిన సలహాలు, సూచనలను అమలు చేయడం జరుగుతుంది. ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుంది.

రాష్ట్రాల నుంచి అందిన అభ్యర్థనల మేరకు తీసుకున్న కొన్ని ప్రధాన నిర్ణయాలు కింద ఇవ్వబడ్డాయి.

1. హాజరు, మొదటి ఫోటో అప్‌లోడ్ చేసిన 4 గంటల తర్వాత రెండో ఫోటో తీయడానికి వీలుగా ఎన్ఎంఎంఎస్ అప్లికేషన్ సవరించబడింది.దీనిలో నిర్ణీత సమయంలో మాత్రమే ఫోటో, హాజరు సేకరించే నిబంధన సులభతరం అవుతుంది. .మొదటి ఫోటోతో పాటు ఉదయం హాజరు ఆఫ్‌లైన్ మోడ్‌లో నమోదు చేయబడుతుంది. నెట్‌వర్క్ పరిధి లోకి పరికరం వచ్చిన తర్వాత అప్‌లోడ్ చేయబడుతుంది.

2. అసాధారణమైన పరిస్థితుల కారణంగా హాజరు అప్‌లోడ్ చేయలేని పక్షంలో, మాన్యువల్ హాజరును అప్‌లోడ్ చేయడానికి జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కి అధికారం ఇవ్వబడింది.

ఎన్ఎంఎంఎస్ మొబైల్ యాప్ ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు మరియు మలయాళంలో అందుబాటులో ఉంది.

ఈ వివరాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి ఈరోజు రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో తెలిపారు.

జాతీయ రహదారులపై టోల్ ప్లాజాలను దాటేందుకు నెలవారీ పాసులు

న్యూఢిల్లీ, జులై 28: జాతీయ రహదారులపై జాతీయ రుసుము నిబంధనల (నేషనల్ ఫీ రూల్స్)కు అనుగుణంగా సంబంధిత రాయితీ ఒప్పందంతో పాటుగా వినియోగదారు రుసుమును వసూలు చేయడం జరుగుతోంది. జాతీయ రహదారుల రుసుము (ధరల, వసూలు నిర్ణయం) నిబంధనలు, 2008 ప్రకారం, జతీయ రహదారులలో ఒక భాగాన్ని, శాశ్వత వంతెన, బైపాస్ లేదా సొరంగంను ఉపయోగించే ఒక డ్రైవరు, యజమాని లేదా యాంత్రిక వాహన ఇన్‌చార్జి అయిన వ్యక్తి జరిపిన ఒక నెల రోజులలో టోల్ ప్లాజా నుంచి గరిష్టంగా యాభైసార్లు ప్రయాణించవలసి వచ్చినప్పుడు రాయితీ రుసుమును ఎంచుకొని చెల్లించవలసిన రుసుములో మూడు వంతుల రుసుమును చెల్లించి ప్రయాణించవచ్చు. దీనితో పాటుగా వినియోగదారు రుసుము నెలవారీ పాసుల రూపంలో అందుబాటులో ఉండి జాతీయ రహదారుల రుసుము నిబంధనలు, సంబంధిత రాయితీ ఒప్పందం ప్రకారం వర్తిస్తుంది. జాతీయ రహదారుల రుసుము (ధరల, వసూలు నిర్ణయం) నిబంధనలు, 2008 ప్రకారం, వాణిజ్యేతర ప్రయోజనాల కోసం ఒక మెకానికల్ వాహన సొంతదారు అయిన వ్యక్తి జతీయ రహదారులలో ఒక భాగాన్ని, శాశ్వత వంతెన, బైపాస్ లేదా సొరంగంను ఉపయోగించేటప్పుడు, 2007-08 సంవత్సర భూమికగా తీసుకున్న రేటు ప్రకారం ఒక నెలకు నూట యాభై రూపాయలను, రుసుముల నిబంధనల ప్రకారం ఏటా సవరించిన మొత్తాన్ని చెల్లించి టోల్ ప్లాజాను దాటేందుకు అధికారాన్ని పొందినప్పుడు ఆ పాసును కేవలం డ్రైవరుకు, యజమానికి, లేదా అటువంటి మెకానికల్ వాహనం ఇన్‌చార్జి అయిన వ్యక్తికి ఇవ్వడం జరుగుతుంది. అయితే, ఈ వాహనం, వ్యక్తి ఆ టోల్ ప్లాజాకు ఇరవై కిలోమీటర్ల లోపు నివసించే వారై ఉండాలి. కాగా, క్లోజ్డ్ యూజర్ ఫీ కలెక్షన్ వ్యవస్థ ఆధారంగా పాస్‌ను జారీ చేసినప్పుడు అటువంటి రాయితీలు ఇవ్వడం జరగదు. అలాగే, అటువంటి డ్రైవరు, యజమాని లేదా మెకానికల్ వాహన ఇన్‌చార్జికి సర్వీసు రోడ్డు లేదా ప్రత్యామ్నాయ రోడ్డు అందుబాటులో ఉన్నప్పుడు కూడా ఈ రాయితీ వర్తించదు.

జాతీయ రహదారుల రుసుము నిబంధనలు, 2008 ప్రకారం, వాణిజ్యేతర ప్రయోజనాల కోసం మెకానికల్ వాహనాన్ని నమోదు చేసుకొని, జాతీయ రహదారిపై ఒక భాగంలో, శాశ్వత వంతెన, బైపాస్ లేదా సొరంగంలో దానిని నడిపేందుకు 2022–23 ఆర్థిక సంవత్సరంలో మూడు వందల పదిహేను రూపాయిల రుసుమును చెల్లించడం ద్వారా పాస్‌ను పొందవచ్చు. అటువంటి పాసును టోల్ ప్లాజాకు ఇరవై కిలోమీటర్ల దూరంలో నివసించే మెకానికల్ ఇన్ చార్జి అయిన వ్యక్తి, యజమాని, డ్రైవరుకు జారీ చేస్తారు.

ఈ సమాచారాన్ని కేంద్ర రహదారి రవాణా ఢ హైవేల మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో వెల్లడించారు.

4జి మొబైల్ సర్వీసులు చేరుకోనటువంటి గ్రామాలకు 26,316 కోట్ల రూపాయల మొత్తం వ్యయంతో ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన మంత్రిమండలి

న్యూఢిల్లీ, జులై 28: ప్రజలు అందరికీ డిజిటల్ సేవల లభ్యం అయ్యేటట్లు చూడడం మరియు సంధానాన్ని సమకూర్చడం అనేవి ప్రభుత్వం యొక్క 'అంత్యోదయ' దృష్టికోణం లో ఒక అంతర్భాగం గా ఉన్నాయి. అయిదు రాష్ట్రాల లో 44 ఆకాంక్షభరిత జిల్లాల లో 7,287 గ్రామాల కు– ఏయే గ్రామాలైతే 4జి మొబైల్ సర్వీసుల కు నోచుకోలేదో – అటువంటి గ్రామాల కు ఆ యొక్క సేవల ను అందించడం కోసం ఉద్దేశించిన ఒక ప్రాజెక్టు కు ప్రభుత్వం కిందటి సంవత్సరం లో ఆమోదాన్ని తెలిపింది.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2021వ సంవత్సరం లో స్వాతంత్ర్య దినం నాడు ఇచ్చిన ప్రసంగం లో, ప్రభుత్వ పథకాలు దేశం లో అందరికీ చేరాలి అంటూ పిలుపు ను ఇచ్చారు. దేశవ్యాప్తం గా 4జి మొబైల్ సర్వీసులు ఇప్పటికీ చేరని అటువంటి గ్రామాల కు ఆ తరహా సేవల ను అందించడానికని మొత్తం 26,316 కోట్ల రూపాయలు వ్యయం అయ్యే ఒక ప్రాజెక్టు ను కేంద్ర మంత్రిమండలి ఈ రోజు న ఆమోదించింది.ఈ ప్రాజెక్టు సుదూర ప్రాంతాల లో మరియు దుర్గమ ప్రాంతాల లో 24,680 గ్రామాల కు 4జి మొబైల్ సర్వీసుల ను– వేటికయితే ఆ ప్రాంతాలు ఇంత వరకు నోచుకోలేదో– అందుబాటు లోకి తీసుకు రానుంది. పునరావాసం, సరికొత్త ఆవాసాలు, ప్రస్తుత ఆపరేటర్ లు అందిస్తున్న సేవల ఉపసంహరణ అనే కారణాల తో 20 శాతం గ్రామాల ను అదనం గా చేర్చుకొనేందుకు ఈ ప్రాజెక్టు లో వీలు ఉంది. దీనికి అదనం గా, కేవలం 2జి/3జి సంధాన సదుపాయాన్ని కలిగివున్నటువంటి 6,279 గ్రామాల ను 4జి కనెక్టివిటీ కి ఉన్నతీకరించడం జరుగుతుంది. ఈ ప్రాజెక్టు నుఆత్మనిర్భర్ భారత్ యొక్క 4జి టెక్నాలజీ స్టాక్ ను వినియోగించుకొంటూ బిఎస్ఎన్ఎల్ అమలుపరుస్తుంది. మరి దీనికి అయ్యే డబ్బు ను యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ నుంచి వెచ్చించడం జరుగుతుంది. ఈ ప్రాజెక్టు కు అయ్యే 26,316 కోట్ల రూపాయల వ్యయం లో మూలధనం రూపేణా చేసే ఖర్చు తో పాటు గా 5 సంవత్సరాల పాటు కార్యకలాపాల నిర్వహణ సంబంధిత వ్యయం కూడా కలిసి ఉంటుంది.బిఎస్ఎన్ఎల్ ఇప్పటికే ఆత్మనిర్భర్ భారత్ తాలూకు 4జి టెక్నాలజీ స్టాక్ ను రంగం లో మోహరించే ప్రక్రియ లో తలమునకలు గా ఉంది; ఈ 4జి టెక్నాలజీ స్టాక్ నే ఈ ప్రాజెక్టు లో కూడాను మోహరించడం జరుగుతుంది.గ్రామీణ ప్రాంతాల లో మొబైల్ కనెక్టివిటీ ని సమకూర్చాలి అనే ప్రభుత్వ దార్శనికత బాట లో ఈ ప్రాజెక్టు ఒక మహత్వపూర్ణమైనటువంటి అడుగు గా ఉంది అని చెప్పాలి. ఈ ప్రాజెక్టు మొబైల్ బ్రాడ్ బ్యాండ్ ద్వారా బ్యాంకింగ్ సేవలు, ఇ–గవర్నెన్స్ సర్వీసులు, టెలి–మెడిసిన్, టెలి–ఎద్యుకేశన్ మొదలైన సేవల ను అందజేయడం తో పాటు ఉపాధి అవకాశాల ను సృష్టించడాన్ని కూడా ప్రోత్సహిస్తుం

ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు, లోక్ సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా అధ్యక్షతన హెపటైటిస్‌పై పార్లమెంట్ సభ్యులకు అవగాహన కార్యక్రమం

న్యూఢిల్లీ, జులై 28: ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం 2022 సందర్భంగా ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ శ్రీ వెంకయ్య నాయుడు, లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా అధ్యక్షతన ఈ రోజు హెపటైటిస్ పై పార్లమెంట్ సభ్యులకు అవగాహన కల్పించేందుకు అవగాహన సమావేశం జరిగింది. దేశంలో హెపటైటిస్ తాజా పరిస్థితి, హెపటైటిస్ నిర్మూలనకు అమలు చేస్తున్న చర్యలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ మన్సుఖ్ మాండవీయ సభ్యులకు వివరించారు. వ్యాధిని సాధ్యమైనంత త్వరగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని శ్రీ మాండవీయ పేర్కొన్నారు.

హెపటైటిస్ సంరక్షణను ప్రధాన ఆసుపత్రులకు మాత్రమే పరిమితం చేయకుండా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు మరియు సామాజిక కేంద్రాలలో హెపటైటిస్ సంరక్షణను కార్యక్రమాలను విస్తరించి సులభంగా సంరక్షణ చర్యలు అందుబాటులోకి వచ్చేలా చేయాలన్న లక్ష్యంతో ఈ ఏడాది ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని ' మీ సమీపానికి హెపటైటిస్ సంరక్షణ' ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు.

పార్లమెంటరీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీస్ లో కార్యక్రమాన్ని భారత పార్లమెంట్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్సెస్ సంయుక్తంగా నిర్వహించాయి.

కార్యక్రమంలో ఉత్సాహంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న పార్లమెంట్ సభ్యులను ఉప రాష్ట్రపతి అభినందించారు. హెపటైటిస్ పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన శ్రీ వెంకయ్య నాయుడు హెపటైటిస్ రహిత భారతదేశ నిర్మాణం కోసం ప్రతి ఒక్క సభ్యుడు తమ నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహించి స్థానిక భాషలో ప్రజలకు అర్ధమయ్యే విధంగా కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు.

హెపటైటిస్ నిర్మూలన కోసం సంఘటిత కృషి అవసరమని లోక్ సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా అన్నారు. భిన్నత్వం తో నిండిన దేశంలో హెపటైటిస్ నిర్మూలన సందేశాన్ని వ్యాప్తి చేయడంలో పార్లమెంట్ సభ్యులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. తన నియోజకవర్గంలో హెపటైటిస్ వ్యాధిని గుర్తించి, హెపటైటిస్ వ్యాధి సోకిన వారికి తగిన చికిత్స అందించి, చికిత్స అనంతరం తగిన సంరక్షణ అందేలా చూసే బాధ్యత సంబంధిత పార్లమెంట్ సభ్యునిపై ఉంటుందని అన్నారు.

ఆరోగ్యంతో అభివృద్ధిని కలిపి చూస్తున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆరోగ్య సంరక్షణ అంశానికి సమగ్ర రూపం తెచ్చి ప్రజల ఆలోచనా దృక్పథంలో మార్పు తెచ్చారని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు. దీనికి నిదర్శనం క్షయ వ్యాధి నిర్మూలన అని పేర్కొన్న డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ప్రభుత్వం మేలు చేస్తున్న ఆరోగ్య సంరక్షణ విధానాల వల్ల ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరిచి సమాజ భద్రతకు దోహదపడతాయని అన్నారు.

హెపటైటిస్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడం వల్ల సకాలంలో సరైన చికిత్స అందించవచ్చునని డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు. కోవిడ్–19 సమయంలో అనుసరించిన పరీక్ష, నిర్ధారణ,చికిత్స విధానం సత్ఫలితాలు ఇచ్చిందని అన్నారు. ప్రాథమిక దశలో హెపటైటిస్ వ్యాధి ఎక్కువ మంది ప్రజలు గుర్తించలేకపోతున్నారని పేర్కొన్నారు. వ్యాధి లక్షణాలు లేకపోవడం లేదా లక్షణాలు కనిపించకపోవడం దీనికి కారణమని మంత్రి అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వ్యాధి తీవ్రతను తగ్గించేందుకు హెపటైటిస్ వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉన్న వర్గాలను గుర్తించడం, హెపటైటిస్ వ్యాధి సోకిన వారి కుటుంబ సభ్యులను లేదా తరచూ రక్త మార్పిడి చేయించుకున్న లేదా పొందుతున్న వారు, డయాలసిస్‌లో ఉన్నవారు, హెచ్ఐవి బారిన పడ్డవారు లేదా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిపై దృష్టి సారించి పరీక్షలు చేయాలని పేర్కొన్నారు.

2030 నాటికి హెచ్ఐవి, వైరల్ హెపటైటిస్ మరియు లైంగికంగా సంక్రమించే ఇన్‌ఫెక్షన్లను నిర్మూలించే లక్ష్యంతో 2022–2030 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా నూతన వ్యూహాలు అమలు కానున్నాయని డాక్టర్ మాండవీయ వివరించారు. హెపటైటిస్ బి వల్ల మరణించిన వారి సంఖ్య హెచ్ఐవి మరణాల సంఖ్య కంటే ఎక్కువగా ఉందని డాక్టర్ మాండవ్య వివరించారు. ఇటీవల కాలంలో ఎక్కువ మరణాలకు, ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్న వైరల్ హెపటైటిస్ బి మరియు సి లు ప్రపంచ ఆరోగ్య సమస్యగా డాక్టర్ మాండవీయ వివరాయించారు. ప్రపంచవ్యాప్తంగా వైరల్ హెపటైటిస్‌తో రోజుకి దాదాపు 4000 మంది చనిపోతున్నారని పేర్కొన్న డాక్టర్ మాండవీయ భారతదేశంలో దాదాపు 40 మిలియన్ల మంది ప్రజలు హెపటైటిస్ బి మరియు సి ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారని తెలిపారు.

హెపటైటిస్ రహిత భారతదేశాన్ని నిర్మించడానికి ప్రజలు, ప్రజా సంఘాలతో కలిసి సంఘాలను ఉత్సాహ పరిచి లాగ్ భాగీదారి (ప్రజల భాగస్వామ్యం)తో ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించాలని రాష్ట్రాలకు డాక్టర్ మన్సుఖ్ మాండవీయ సూచించారు. నివారణ, పరీక్షలు మరియు చికిత్స అనే త్రిముఖ విధానాన్ని అవలంబించడం ద్వారా హెపటైటిస్‌ను నిర్మూలించడానికి మరియు దానిని జన ఆందోళనగా మార్చడానికి ప్రతి ఒక్కరూఅంకిత భావంతో పని చేయాలని ఆయన కోరారు.

హెపటైటిస్‌తో జీవిస్తున్న వ్యక్తులపై వివక్ష చూపకూడదని ప్రతిజ్ఞ చేసిన పార్లమెంట్ సభ్యులు హెపటైటిస్‌కు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో లోక్‌సభ సెక్రటరీ జనరల్ శ్రీ ఉత్పల్ కుమార్ సింగ్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ శ్రీ హరివంశ్ నారాయణ్ సింగ్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ వినయ్ కుమార్ సక్సేనా, ఇన్స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్సెస్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్ కె సరిన్, శ్రీ ప్రసేన్‌జిత్ సింగ్, లోక్‌సభ సెక్రటేరియట్ అదనపు కార్యదర్శి పాల్గొన్నారు.

గొర్రెల పెంపకం దారులు డీడీలు 15 రోజుల్లోగా స్థానిక పశు వైద్యాధికారులకు అందజేయాలి- - మేకల మల్లిబాబు యాదవ్

ఖమ్మం, జులై 28 (నేటినిజం ప్రతినిధి) :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కురుమ యాదవుల అభివృద్ధి సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం రాష్ట్ర శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, ఆదేశాల మేరకు రెండవ విడత త్వరలో 175000/ – మంజూరు కానున్నదని, ప్రతి లబ్ధిదారుడు 43,750 రూపాయలు చొప్పున 15 రోజుల్లోగా డీడీలు తీసి స్థానిక పశు వైద్యులకు అందజేయాలని ఖమ్మం జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, పిలుపునిచ్చారు.

బుధవారం కామేపల్లి మండల కేంద్రంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బంగారు తెలంగాణ లక్ష్యసాధనలో భాగంగా ముఖ్యమంత్రి కెసిఆర్ అంతరించిపోతున్న కులవృత్తులను ప్రోత్సహిస్తున్నారని, దానిలో భాగంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి కురుమ యాదవులకు గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం యాదవ్, ఆధ్వర్యంలో మొదటి విడతలో జిల్లాలో 15660మంది లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని, ఇంకా మొదటి విడతలో 664 మందికి మరియు రెండవ విడతలో 16,180 మందికి మంజూరయ్యాయని, తగు ఆదేశాలు అధికారులకు అందాయని, స్థానిక పశువైద్య అధికారుల్ని సంప్రదించి డీడీలు త్వరగా తీయాలని తెలిపారు. గతంలో గొర్రెల పంపిణీ కార్యక్రమంలో జరిగిన లోటుపాట్లను గుర్తించి ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాలో నేరుగా డబ్బులను జమ చేయాలని, మల్లి బాబు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెల సంఘం అధ్యక్షుడు ముత్తేబోయిన రామ్మూర్తి, కాలసాని నరసయ్య, అమరబోయిన గురవయ్య, దాసరి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

నీలి ఆర్థిక విధానం (బ్లూ ఎకానమీ పాలసీ)

న్యూఢిల్లీ, జులై 28: కేంద్ర ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ దేశం కోసం నీలి ఆర్థిక వ్యవస్థ (బ్లూ ఎకానమీపై) జాతీయ విధానాన్ని ఖరారు చేసింది. భారతదేశ నీలి ఆర్థిక వ్యవస్థపై ముసాయిదా పాలసీ ఫ్రేమ్‌వర్క్ తయారు చేయబడింది. ముసాయిదా బ్లూ ఎకానమీ పాలసీ ఫ్రేమ్‌వర్క్ తీర ప్రాంతాల స్థిరమైన అభివృద్ధి కోసం సముద్ర డొమైన్‌లోని అన్ని రంగాల (జీవన, నిర్జీవ వనరులు, పర్యాటకం, సముద్ర శక్తి మొదలైనవి) యొక్క సరైన వినియోగాన్ని పరిగణలోకి తీసుకుంది. ఈ పాలసీ డాక్యుమెంట్‌లో నేషనల్ అకౌంటింగ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ బ్లూ ఎకానమీ మరియు ఓషన్ గవర్నెన్స్, కోస్టల్ మెరైన్ స్పేషియల్ ప్లానింగ్ మరియు పర్యటకం ప్రాధాన్యత, మెరైన్ ఫిషరీస్, ఆక్వాకల్చర్ మరియు చేపల ప్రాసెసింగ్‌పై కీలక సిఫార్సులు ఉన్నాయి. తయారీ, అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, వాణిజ్యం, సాంకేతికత, సేవలు, నైపుణ్యాభివృద్ధి, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలు, షిప్పింగ్, తీర, లోతైన సముద్ర మైనింగ్, ఆఫ్‌షోర్ శక్తి మరియు భద్రత, వ్యూహాత్మక కొలతలు అంతర్జాతీయ ఎంగేజ్‌మెంట్‌లు కూడా ఇందులో పరిగణనలోకి తీసుకున్నారు.

బ్లూ ఎకానమీ అడ్వైజరీ కౌన్సిల్‌లో పలువురికి చోటు..

ప్రతిపాదిత నేషనల్ బ్లూ ఎకానమీ అడ్వైజరీ కౌన్సిల్‌లో (బీఈఏసీ) సంబంధిత మంత్రిత్వ శాఖలు/డిపార్ట్‌మెంట్ల కార్యదర్శులను కలిగి ఉంటుంది. సభ్యులుగా ఇందులో కోస్తా రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులు/ప్రిన్సిపల్ సెక్రటరీలు మరియు పరిశ్రమల ప్రతినిధులు కూడా ఉంటారు. ముసాయిదా పాలసీ డాక్యుమెంట్ సాధారణ ప్రజలు , సంబంధిత భాగస్వామ్యపక్షాల వారి అభిప్రాయాలు మరియు ఫీడ్‌బ్యాక్ కోసం ఉంచబడింది. మంత్రిత్వ శాఖలు/ డిపార్ట్‌మెంట్లు, పార్లమెంట్ సభ్యులు, ప్రభుత్వేతర సంస్థలు (ఎన్‌జీవోలు), పరిశ్రమల ప్రతినిధులు మరియు సాధారణ ప్రజల నుండి స్వీకరించబడిన అనేక విలువైన అభిప్రాయాలు/సూచనలు పరిగణనలోకి తీసుకోబడినాయి. తదనుగుణంగా పాలసీ పత్రం సవరించబడింది.

75 బీచ్‌ల శుభ్రతకు75 రోజుల తీరప్రాంత క్లీన్–అప్ కార్యక్రమం ..

'స్వచ్ఛ్ పృథ్వీ.. స్వచ్ఛ్ సాగర్' థీమ్‌తో ఎటువంటి కార్యాచరణ లేకుండా 'స్వచ్ఛ్ సాగర్, సురక్షిత్ సాగర్' థీమ్‌తో కార్యాచరణ అమలు చేయబడుతోంది. ఇది 05 జూలై 2022న ప్రారంభమై 17 సెప్టెంబర్ 2022న 'అంతర్జాతీయ తీరప్రాంత క్లీన్ అప్ డే'తో ముగుస్తుంది, తీరప్రాంత జిల్లాల వెంబడి కనీసం 75 బీచ్‌ల శుభ్రత కోసం 75 రోజుల పాటు సాగే తీరప్రాంత క్లీన్–అప్ కార్యక్రమం ఇది. భారత కోస్ట్ గార్డ్, ఎంఓఈఎఫ్ ఢ సీసీ, ఎంఓవైఏఎస్, ఎన్‌డీఎంఈ, పర్యావరణ సంరక్షణ గతివిధి మరియు ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు మరియు విద్యార్థులతో కలిసి ఎంఓఈఎస్ ఈ కార్యాక్రమాన్ని నిర్వహిస్తోంది. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ఎర్త్ డే, ఓషన్ డే మొదలైన వాటి ద్వారా సమస్యలపై అవగాహన ప్రచారాలు, పోటీలు, వర్క్‌షాప్‌లు/సెమినార్‌ల కోసం చర్యలు/కార్యక్రమాలు ఉంటాయి. ఎర్త్ సైన్సెస్ శాఖ మరియు సైన్స్ ఢ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి (ఐసీ) డా. జితేంద్ర సింగ్ ఈరోజు లోక్‌సభకు ఇచ్చిన ఒక లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారాన్ని అందించారు.

అందుబాటు ధరలో బ్రాడ్ బ్యాండ్, మొబైల్ సర్వీస్

న్యూఢిల్లీ, జులై 28: గ్రామీణ మరియు మారుమూల ప్రాంతాలలో చౌకైన బ్రాడ్ బ్యాండ్ మరియు మొబైల్ సేవల వ్యాప్తిని ప్రారంభించడానికి యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ (యూఎసీ) అనేక ప్రాజెక్టులను చేపట్టింది. భారత్ నెట్ ప్రాజెక్టుల్లో మొత్తం 5,81,351 కి.మీ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ (ఓఎఫ్ సి)ని 2,64,549 గ్రామ పంచాయితీలను (గ్రామపంచాయితీలు) అనుసంధానించడానికి వేయబడింది మరియు ప్రస్తుతం 1,77,550 జిపిలు సేవలు సిద్ధంగా ఉన్నాయి, వీటిలో 4394 జిపిలు శాటిలైట్ ద్వారా కనెక్ట్ చేయబడ్డాయి. అండమాన్ మరియు నికోబార్ దీవులు జలాంతర్గామి కేబుల్ ద్వారా ప్రధాన భూభాగంతో అనుసంధానించబడ్డాయి. లక్షద్వీప్ ను ప్రధాన భూభాగంతో అనుసంధానించడానికి జలాంతర్గామి కేబుల్ వేయడానికి మరొక ప్రాజెక్టు ఉంది. వామపక్ష తీవ్రవాదం ప్రభావిత ప్రాంతాల్లో, ఆకాంక్షాత్మక జిల్లాల్లోని గ్రామాలు మరియు ఈశాన్య ప్రాంతంలో మొబైల్ సేవలను అందించడం వంటి అనేక ఇతర పథకాలు ఉన్నాయి.

యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ (యుఎస్ఓఎఫ్) కింద వార్షిక సేకరణలో ఐదు శాతం పరిశోధన మరియు అభివృద్ధి (పరిశోధన మరియు అభివృద్ధి) ను ప్రోత్సహించడానికి మరియు సాంకేతికతలు మరియు పరిష్కారాల వాణిజ్యీకరణను ప్రోత్సహించడానికి కేటాయించబడుతుంది.

భారత్ నెట్ యొక్క పిపిపి మోడల్ కింద అమలు చేయడానికి 20.07.2021 న గ్లోబల్ బిడ్లను ఆహ్వానించారు. ఏదేమైనా, సంభావ్య బిడ్డర్ల నుండి ఎటువంటి ప్రతిస్పందన రాలేదు. తదనుగుణంగా భారత్ నెట్ కోసం సవరించిన వ్యూహాన్ని రూపొందిస్తున్నారు.

ఈ రోజు లోక్ సభ లో ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానంలో కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి శ్రీ దేవుసిన్హ్ చౌహాన్ ఈ సమాచారాన్ని ఇచ్చారు.

నేషనల్ డేటా గవర్నెన్స్ ఫ్రేమ్‌వర్క్ పాలసీ

న్యూఢిల్లీ, జులై 28: నేషనల్ డేటా గవర్నెన్స్ ఫ్రేమ్‌వర్క్ పాలసీ ముసాయిదా ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థల నుండి వ్యక్తిగతేతర డేటా మరియు అనామక డేటాను రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఎకో–సిస్టమ్ ద్వారా సురక్షితంగా యాక్సెస్ చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.

డేటా/డేటాసెట్‌లు/మెటాడేటా నియమాలు, ప్రమాణాలు, మార్గదర్శకాలు మరియు గోప్యత, భద్రత మరియు నమ్మకాన్ని నిర్ధారిస్తూ వ్యక్తిగతేతర డేటా సెట్‌లను భాగస్వామ్యం చేసేందుకు ప్రోటోకాల్‌ల కోసం సంస్థాగత ఫ్రేమ్‌వర్క్‌ను అందించడం ఈ విధానం లక్ష్యం.

ఐడీఎంఓ ప్రతి మంత్రిత్వ శాఖలో సామర్థ్యాలను పెంపొందించడం ద్వారా డేటా నిర్వహణను ప్రామాణీకరించడానికి సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు ఇతర స్కీమాటిక్ ప్రోగ్రామ్‌లతో సన్నిహితంగా సమన్వయం చేస్తుంది. ఇంకా ఇది మంత్రిత్వ శాఖలు, ప్రైవేట్ కంపెనీలలో ఉన్న వ్యక్తిగతేతర డేటాసెట్‌లను ఇండియా డేటాసెట్స్ ప్రోగ్రామ్‌లో చేర్చడాన్ని వేగవంతం చేస్తుంది.

ప్రజల సంప్రదింపుల కోసం కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ 26 మే 2022న నేషనల్ డేటా గవర్నెన్స్ ఫ్రేమ్‌వర్క్ పాలసీ ముసాయిదాని విడుదల చేసింది. ప్రస్తుతం ముసాయిదా విధానం ఖరారు దశలో ఉంది.

ఎలక్ట్రానిక్స్ ఢ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ ఈరోజు లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారం ఇచ్చారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా "ఉజ్వల్ భారత్ ఉజ్వల్ భవిష్య - విద్యుత్ఏ2047"

న్యూఢిల్లీ, జులై 28:విద్యుత్, నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" లో భాగంగా "ఉజ్వల్ భారత్ ఉజ్వల్ భవిష్య – విద్యుత్ ఏ2047" కార్యక్రమాన్ని 2022 జూలై 25 నుండి 30వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పవర్ సి.పి.ఎస్.ఈ లు, రాష్ట్ర డిస్కామ్‌లతో అనుబంధంతో జరుపుకుంటుంది.

ఈ కార్యక్రమం జాతీయ, రాష్ట్ర దృక్కోణాల నుండి ప్రజలకు విద్యుత్, పునరుత్పాదక ఇంధన రంగాలలో సాధించిన విజయాలను ప్రదర్శిస్తుంది మరియు 2047లో భారతదేశం స్వాతంత్ర్యం పొంది 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ రంగాలలో భారతదేశం యొక్క దృక్పథాన్ని కూడా ప్రదర్శిస్తుంది. దక్షిణ ఢిల్లీ జిల్లాలో, ఈ కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం 28 మరియు 29 జూలై 2022న నిర్వహిస్తోంది. పవర్ సిస్టమ్ ఆపరేషన్ కార్పొరేషన్ (ఖూూఅూ) లిమిటెడ్ దక్షిణ ఢిల్లీలో జరిగే కార్యక్రమాలకు సమన్వయ సి.పి.ఎస్.ఈ గా సమన్వయం చేస్తోంది.

న్యూఢిల్లీలోని మెహ్రౌలీలోని సర్వోదయ కో–ఎడ్ సీనియర్ సెకండరీ స్కూల్ లో జూలై 28న జరిగే కార్యక్రమానికి గౌరవ పార్లమెంటు సభ్యుడు శ్రీ రమేష్ బిధురి ముఖ్య అతిథిగా హాజరవుతారు. జూలై 29న, న్యూ ఢిల్లీ లోని పుష్ప్ విహార్ లోని గవర్నమెంట్ గర్ల్స్ సీనియర్ సెకండరీ స్కూల్ లో జరిగే కార్యక్రమానికి దక్షిణ ఢిల్లీ డి.ఎం. మోనికా ప్రియదర్శిని ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు.

కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపిపి ఈదురు రాజేశ్వరి

మహబూబాబాద్, జులై 28 (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఆదేశాల మేరకు బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు.

తెలంగాణ ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల పిల్లల కోసం ప్రభుత్వ గురుకులాల్లో, పాఠశాలలో నాణ్యమైనా విద్యను,మౌలిక వసతులు కలిపిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం కెసీఆర్ అని ఎంపిపి ఈదురు రాజేశ్వరి పెద్దవంగర అన్నారు. తరువాత ఎంపిపి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పిల్లలకు అదించాలని అన్నారు.విద్యార్థుల నాణ్యమైన విద్యను అధించి, వారి పట్ల తగిన జాగ్రత్త ఉండాలని ఉపాధ్యాయులకు, ప్రిన్సిపాల్ కు తగుసూచనలు ఇచ్చారు.చిన్నావంగర గ్రామంలో నిర్మాణం అవుతున్న పాఠశాలను వేగవంతంగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్ను ఆదేశించారు. అప్పటి వరకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు చూసించారు.

ఈ కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థానం చైర్మన్ రాంచంద్రయ్య శర్మ, ఎంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి, ఎంపిటిసి లు ఎదునూరి శ్రీనివాస్, ఈరెంటి అనురాధ,ఎర్ర సభితా,కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రత్యేక అధికారిణి స్రవంతి, కొరిపల్లి సర్పంచ్ గాజుల శోభా,పంచాయతీ కార్యదర్శి వెంకన్న,మోత్యా తండా పార్టీ అధ్యక్షులు భూక్యా దస్రు, నాయకులు ఇమ్మడి వెంకన్న, ఎదునూరి మహేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..

కేంద్ర రిజర్వు పోలీసు దళం (సిఆర్‌పిఎఫ్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిబ్బందికి శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, జులై 28: కేంద్ర రిజర్వు పోలీసు దళం (సిఆర్‌పిఎఫ్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిబ్బందికి కేంద్ర హోం ఢ సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు. దేశ భద్రతను చెక్కు చెదరకుండా ఉంచడంలో ప్రత్యేక సహకారాన్ని అందించడమే కాక, ప్రతి భారతీయుడూ గర్వించే ఘనమైన వీర చరిత్రను సిఆర్‌పిఎఫ్ సృష్టించిందని హోం మంత్రి ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. సిఆర్‌పిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జవాన్లకు శుభాకాంక్షలు తెలుపడమే కాక అంకిత భావంతో అందించిన సేవలకు, దేశం పట్ల అంకిత భావానికీ నా అభివందనలు (సెల్యూట్) అని ఆయన అన్నారు.

కేంద్ర రిజర్వు పోలీసు దళాన్ని 27 జులై, 1939లో క్రౌన్ రిప్రజెంటేటివ్ పోలీసు (రాణికి ప్రాతినిధ్యం వహించే పోలీసు)గా ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యానంతరం, 28 డిసెంబరు 1949లో పార్లమెంటులో చేసిన చట్టం ద్వారా ఈ దళానికి కేంద్ర రిజర్వు దళంగా పేరు పెట్టారు. నూతనంగా స్వతంత్రం సాధించిన దేశ మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఈ దళం పోషించనున్న బహుముఖ పాత్రలను నాటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ముందుగానే ఊహించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి - జిల్లా అదనపు కలెక్టర్ బి సత్య ప్రసాద్

రాజన్న సిరిసిల్ల, జులై 28 (నేటినిజం ప్రతినిధి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్త గా ఉండాలని , డెంగ్యూ ప్రబలకుండా చూడాలనీ జిల్లా అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు.పరిశుద్ధం ,సీజనల్ వ్యాధుల పై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం లో అడిషనల్ కలెక్టర్ సత్య ప్రసాద్ ఆకస్మిక పర్యటన చేశారు.మండలం లోని నర్సింగాపూర్, వెంకట్రావు పల్లి,బోయినపల్లి, మల్కాపూర్ లో పర్యటించి పరిశుద్ధం,శానిటేషన్ ను పరిశీలించారు. గ్రామాల్లో నీరు నిలువ లేకుండా చూసేలా ప్రజలకు అవగాహన కల్పించి ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు.గ్రామాల్లో ఏ ఎన్ ఎమ్, ఆశ వర్కర్లు,పంచాయతి సిబ్బంది,తిరుగుతూ సర్వే చేస్తున్నార అని అడిగి తెలుసుకున్నారు.ఎప్పటి కప్పుడు రిపోర్ట్ పంపించాలని తెలిపారు.ఇంటి ఇంటికి వెళ్లి నీరు నిలువ లేకుండా చూడాలని నీరు నిలువ ఉంటే డెంగ్యూ జ్వరాల బారిన పడతారని ఇప్పటి వరకు జిల్లా లో 18 డెంగ్యూ కేసులు గుర్తించినట్లు తెలిపారు .ప్రస్తుతం వర్షా కాలం కావడం తో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి రోజు డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు .అడిషనల్ కలెక్టర్ వెంట డిపిఓరవీందర్,డిఎల్పీఓ మల్లికార్జున్,ఎంపిడివో నల్ల రాజేందర్ రెడ్డి, వైద్యాధికారి శ్రీకర్,మండల పంచాయతీ అధికారి గంగ తిలక్,సర్పంచ్ లు గుంటి లత శ్రీ,కోరేపు నరేష్,కార్యదర్శులు,సిబ్బందిఉన్నారు..

మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద దేశీయంగా పరిశుభ్రమైన బొగ్గు సాంకేతికత అభివృద్ధి కృషికి ప్రోత్సాహం

న్యూఢిల్లీ, జులై 28: భారత ఇంధన వ్యవస్థలో బొగ్గుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. దేశంలో మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 70 శాతం వరకు విద్యుత్ ఉత్పత్తి బొగ్గుఆధారిత మైనది. విద్యుత్ ఉత్పత్తితో పాటు, ఇతర రంగాలైన స్టీలు, దుక్క ఇనుము, సిమెంటు, పేపర్ తదితరాలకు కూడా బొగ్గు ను ప్రధాన ఇంధనంగా వాడుతారు.మేక్ ఇన్ ఇండియా కు సంబంధించిన చర్యలు, పెద్ద ఎత్తున ఆర్థిక వృద్ధికి సంబంధించిన అంచనాలతో రాగల సంవత్సరాలలో బొగ్గు వాడకం గణనీయంగా పెరగనుంది. అయితే, బొగ్గు ఆధారిత విద్యుత్ ప్రస్తుతం 70 శాతంగా ఉంది. 2030 నాటికి పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి పెరగడం వల్ల ఇది బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి 50 శాతానికి తగ్గే అవకాశం ఉంది.

దేశానికి ఇంధనరంగంలో భద్రత కల్పించేందుకుగాను, పరిశుభ్రమైన బొగ్గు సాంకేతికతను బొగ్గు రంగంలో తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కింది చర్యలు తీసుకోనున్నది.

కోకింగ్ కోల్ ఉత్పత్తిని పెంచేందుకు కోకింగ్ కోల్ మిషన్‌ను ప్రభుత్వం చేపట్టింది. ఇది స్టీలు రంగం డిమాండ్ సరఫరాను తట్టుకునే విధంగా చూడడం జరుగుతోంది. ఈ కార్యక్రమం కింద 12 కోకింగ్ కోల్ వాషరీలను ఒక్కొక్కటి 30 ఎంటివైల సామర్థ్యంతో నిర్మించనున్నారు.

కోల్ గాసిఫికేషన్ మిషన్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. 2030నాటికి 100 ఎంటిలను గాసిఫై చేయాలన్నది లక్ష్యం. ఈ మిషన్ కింద ఉపరితల బొగ్గు, లిగ్నయిట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను నిర్మించడం జరుగుతోంది.

ప్రభుత్వం కోల్ నిక్షేపాలు గల ప్రాంతాలనుంచి సిబిఎం వాయువులను ఉత్పత్తిచేస్తోంది. అలాగే ప్రభుత్వం కోల్ నుంచి హైడ్రోజన్ మిషన్‌పై పనిచేస్తోంది. ఈ చర్యలన్నీ దేశ భవిష్యత్ ఇంధన భద్రతకు ఉపయోగపడనున్నాయి.

మేక్ ఇన్ ఇండియా మిషన్ కింద, ప్రభుత్వం దేశీయంగా క్లీన్ కోల్ టెక్నాలజీని అభివృద్ధిచేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటోంది.

ఈ సమాచారాన్ని కేంద్ర బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి లోక్‌సభకు ఒక లిఖిత పూర్వక సమాధానంలో తెలిపారు.

పెండింగ్ లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్స్ లను వెంటనే పరిష్కరించాలి.

-సిఐటియు జిల్లా అధ్యక్షులు కుంట ఉపేందర్

మహబూబాబాద్, జులై 28 (నేటినిజం ప్రతినిధి): అనేక సంవత్సరాల నుండి పెండింగ్ల ఉన్న భవన నిర్మాణ కార్మికుల క్లైమ్సులను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తొర్రూరు పట్టణ కేంద్రంలోని విశ్రాంతి భవనం నుండి సిఐటియు తొర్రూరు మండల కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్మికులంతా తొర్రూరు అసిస్టెంట్ లేబర్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అసిస్టెంట్ లేబర్ కార్యాలయ అధికారి సుమతి కి అందజేశారు. ఈ సందర్భంగా కుంట ఉపేందర్ మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును సాధించుకోవడం కోసం దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహించి సాధించుకోవడం జరిగిందని అన్నారు. దీనికోసం స్వయం ప్రతిపత్తి గల సంక్షేమ బోర్డు ద్వారా కార్మికుల సంక్షేమానికి ప్రతి పైసా కార్మికులకు మాత్రమే ఉపయోగించాలని, అదే కాకుండా సంక్షేమ బోర్డులో కిందిస్థాయి నుండి పై స్థాయి వరకు విచ్చలవిడి అవినీతి జరుగుతూ కోట్ల రూపాయలు పక్కదారి పడుతున్నాయని అన్నారు. సంక్షేమ బోర్డులో వేల కోట్ల రూపాయల నిధులు ఉన్న కార్మికుల సంక్షేమాన్ని మాత్రం విస్మరించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డులో నిల్వ ఉన్న నిధుల డబ్బులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం వినియోగించాలని అన్నారు. అంతేకాకుండా 60 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికుడికి బోర్డు ద్వారా ఐదు వేల రూపాయలు పెన్షన్ అందజేయాలని, కార్మికులకు భవన నిర్మాణ పనిముట్లు మరియు మోటార్ సైకిల్స్ అందజేయాలని, ఇల్లు లేని కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. కార్మిక శాఖలో జరుగుతున్న అవినీతిని ఉన్నతాధికారులు స్పందించి అరికట్టడం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాటబోయిన శ్రీశైలం, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు దుండి వీరన్న, బాబు గౌడ్, ఎండీ యాకూబు, మోహన్, ఉప్పలయ్య, యాదగిరి, వీరభద్రం, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

గిర్మాపుర్ గరుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

సంగారెడ్డి జులై 28 (నేటి నిజం ప్రతినిధి) కొండాపూర్ మండలంలోని గిర్మాపూర్ గురుకుల పాఠశాలలో గురువారం నాడు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ ఆకస్మిక తనిఖీ చేసారు. పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడుతూ తరగతులలో విద్యాబోధనపై, హాస్టల్ వసతులపై, భోజన మెనూ సరిగా పాటిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పరిశుభ్రత లేకపోవడంతో ప్రిన్సిపల్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ లోని వంటగదిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అన్నం సాంబార్ రుచి చూసి బాగా లేకపోవడంతో మీ ఇంట్లో పిల్లలకి మీరు ఇలాగే వండిపెడతార అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూరగాయాలు బాగా లేక పోవడంతో కూరగాయల సప్లై చేసేవారికి ఒక నెల బిల్లు ఆపాలని అధికారులకు ఆదేశించారు. ఆనంతరం పిల్లలతో కలిసి భోజనం చేసారు. అతి త్వరలో మళ్ళీ ఆకస్మిక తనిఖీ చేస్తానని అప్పటివరకు తీరు మార్చకపోతే కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.

జాతీయ కుటుంబ నియంత్రణ శిఖరాగ్ర సదస్సు - 2022 లో ప్రసంగించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్

న్యూఢిల్లీ, జులై 28: కుటుంబ నియంత్రణ అవసరాన్ని, ప్రాముఖ్యతను భారతదేశం ముందుగానే అర్థం చేసుకుందని, 1952లో జాతీయ కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని ప్రారంభించిన మొదటి దేశంగా అవతరించిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ అన్నారు. బుధవారం ఢిల్లీ లో జాతీయ కుటుంబ నియంత్రణ శిఖరాగ్ర సదస్సు 2022 కు ఆమె అధ్యక్షత వహించారు. గౌరవ ప్రధాన మంత్రి ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా "సుస్థిర ప్రయత్నాలు, సారథ్య భాగస్వామ్యాలు, స బ్ కా సాథ్ , స బ్ కా విశ్వాస్ , స బ్ కా ప్రయాస్, స బ్ కా వికాస్ తో కుటుంబ నియంత్రణ లక్ష్య రూపకల్పన "ఇతివృత్తం తో ఈ సదస్సు ను నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ మాట్లాడుతూ, " 31 రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాలు మొత్తం సంతానోత్పత్తి రేటును 2.1 లేదా అంతకంటే తక్కువ నమోదు చేయడంతో భారతదేశం భర్తీ స్థాయి సంతానోత్పత్తిని సాధించిందని , ఆధునిక గర్భనిరోధకాల వాడకం గణనీయంగా 56.5% (ఎన్ ఎఫ్ హెచ్ ఎస్ -5) కు పెరిగిందని చెప్పారు. "ఎన్ ఎఫ్ హెచ్ ఎస్ -5 డేటా స్పేసింగ్ పద్ధతుల వైపు మొత్తం సానుకూల మార్పును సూచిస్తుందని, ఇది మాతా మరియు శిశు మరణాలను , అనారోగ్యాన్ని సానుకూలంగా ప్రభావితం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది" అని ఆమె పేర్కొన్నారు.

మిషన్ పరివార్ వికాస్ (ఎమ్ పి వి) -2016 జాతీయ కుటుంబ నియంత్రణ కార్యక్రమానికి మరింత ఉత్తేజాన్ని ఇచ్చిందని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. ఈ పథకం కింద, నయీ పెహెల్ కిట్ల పంపిణీ, సాస్ బహు సమ్మేళన్ సార్థీ వ్యాన్లు వంటి సృజనాత్మక వ్యూహాలు ప్రజా సమూహాలను చేరుకోవడానికి, కుటుంబ నియంత్రణ, ఆరోగ్యకరమైన జననాలు, చిన్న కుటుంబాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడానికి దోహద పడుతున్నాయి. "కొత్తగా పెళ్లయిన వారికి 17 లక్షలకు పైగా నయీ పెహెల్ కిట్లను పంపిణీ చేశామని, 7 లక్షలకు పైగా సాస్ బహు సమ్మేళనాలు నిర్వహించామని, 32 లక్షల మందికి సార్థీ వ్యాన్ల ద్వారా కౌన్సిలింగ్ ఇచ్చామని, ఈ ప్రయత్నాల కారణంగానే ఔఈఉటూ-5 డేటా అన్ని ఎం పి వి రాష్ట్రాలలో ఆధునిక గర్భనిరోధక వినియోగంలో గణనీయమైన పెరుగుదలను , తీరని అవసరాలను తగ్గించడాన్ని చూపుతుంది" అని ఆమె తెలిపారు.

భారతదేశం ఎఫ్ పి 2020లో ముఖ్యమైన సభ్యదేశమని, ఇప్పుడు ఎఫ్ పి 2030 భాగస్వామ్యానికి మారిందని మంత్రి అన్నారు. ఈ భాగస్వామ్యానికి భారతదేశ నిబద్ధత లో భాగంగా కుటుంబ నియంత్రణ కోసం మూడు బిలియన్ డాలర్ల ను పెట్టుబడి పెట్టడంజరిగిందని ఆమె తెలిపారు."2012 - 2020 మధ్య, భారతదేశం లో ఆధునిక గర్భనిరోధకాల వాడకందారులు అదనంగా 1.5 కోట్ల మంది కి పైగా చేరారు. తద్వారా ఆధునిక గర్భనిరోధక సాధనాల వినియోగం గణనీయంగా పెరిగింది" అని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా, మంత్రి భారతదేశ కుటుంబ నియంత్రణ 2030 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. మెడికల్ ఎలిజిబిలిటీ క్రైటీరియా (ఎం ఇ సి), వీల్ అప్లికేషన్, ఈ-మాడ్యూల్ ఆఫ్ ఫ్యామిలీ ప్లానింగ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎఫ్ పి ఎల్ ఎం ఐ ఎస్) , డిజిటల్ ఇంటర్వెన్షన్ విభాగంలో కుటుంబ నియంత్రణపై డిజిటల్ ఆర్కైవ్‌లను కూడా ప్రారంభించారు. కమ్యూనిటీని శక్తివంతం చేయడానికి , సమగ్ర సేవలను అందించడంలో ప్రభుత్వ అచంచలమైన నిబద్ధతను చూపడానికి, డాక్టర్ పవార్ నేషనల్ ఫ్యామిలీ ప్లానింగ్ హెల్ప్‌లైన్ మాన్యువల్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సి హెచ్ ఓ) బుక్‌లెట్ , ఏ ఎస్ హెచ్ ఎ బ్రోచర్ , కరపత్రాన్ని (కుటుంబ ప్రణాళిక) కూడా ప్రవేశ పెట్టారు.

"అట్టడుగు స్థాయిలో సేవలందించిన ఆరోగ్య కార్యకర్తలను అభినందిస్తూ, కుటుంబ నియంత్రణ కార్యక్రమం విజయానికి అచంచలమైన ప్రయత్నాలతో వారు కీలకమైన ఛాంపియన్లు గా నిలిచారని " డాక్టర్ పవార్ ప్రశంసించారు. మేల్ పార్టిసిపేషన్, స్పేసింగ్ మెథడ్స్, సెల్ఫ్ కేర్ మెథడ్స్, పిపిఐయుసిడి, ఇంజెక్టబుల్ ఎమ్ పి ఎ కేటగిరీల కింద ఆమె రాష్ట్రాలను సత్కరించారు. డాక్టర్లకు (మగ మరియు ఆడ స్టెరిలైజేషన్ కేటగిరీల కింద), నర్సులు (పిపిఐయుసిడి ఇంజెక్టబుల్ ఎమ్ పిఎ కేటగిరీల కింద), ఫ్యామిలీ ప్లానింగ్ లో అత్యుత్తమ పనితీరు కనబర్చినందుకు హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్ లు ,వ్యాసెక్టమీ క్లయింట్ లను ప్రోత్సహించినందుకు ఆశా వర్కర్ లకు సర్వీస్ ప్రొవైడర్ అవార్డులు కూడా అందించారు.

కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్ మాట్లాడుతూ, భారతదేశంలో కుటుంబ నియంత్రణ కార్యక్రమం ఇప్పుడు ఏడు దశాబ్దాలకు పైగా పురాతనమైందని, ఈ కాలంలో, జనాభా నియంత్రణ భావన నుండి జనాభా స్థిరీకరణకు , నిరంతర సంరక్షణ సామరస్యాన్ని నిర్ధారించే దిశగా భారతదేశం ఒక మార్పును చూసిందని అన్నారు. ఈ

సందర్భంగా ఆయన మూడు ఇతివృత్త రంగాలను ప్రస్తావించారు. మొదటిది, భారతదేశం రీప్లేస్ మెంట్ లెవల్ ఫెర్టిలిటీని సాధించినప్పటికీ, పునరుత్పత్తి వయస్సు గ్రూపులో ఇప్పటికీ గణనీయమైన జనాభా ఉంది, వారు ప్రభుత్వ జోక్య ప్రయత్నాలకు కేంద్రంగా ఉండాలి. రెండవది, భారతదేశం దృష్టి సాంప్రదాయకంగా సరఫరా వైపు, అంటే ప్రొవైడర్లు , డెలివరీ వ్యవస్థలపై ఉంది. కుటుంబం, కమ్యూనిటీ , సమాజంతో సహా డిమాండ్ వైపు దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. "ఈ దృష్టితో గణనీయమైన మార్పు సాధ్యమవుతుంది, పెరుగుదల మార్పుకు బదులుగా", అని ఆయన పేర్కొన్నారు. మిషన్ పరివార్ వికాస్ కింద కమ్యూనిటీ ఆధారిత పథకం నిబంధనల నుండి ప్రయోజనం పొందడానికి ,దానిని మరింత శుద్ధి చేయడానికి రాష్ట్రాలు ప్రత్యేక ప్రయత్నాలు చేయాలి. చివరగా, నాలెడ్జ్, స్కిల్స్ , సృజనాత్మక సేవల ద్వారా ఎఫ్ పి 2030 కింద మన నిబద్ధతను అందించడానికి మన సామర్థ్యాన్ని పెంపొందించడంలో కుటుంబ నియంత్రణ సర్వీస్ ప్రొవైడర్ ల పూల్ గణనీయమైన పాత్రను పోషించాలి. "సమర్థవంతమైన ,సరైన శిక్షణ పొందిన శ్రామిక శక్తి మన కుటుంబ నియంత్రణ ప్రయత్నానికి పునాదిగా ఉండాలి. ఇది మన మా సేవల నాణ్యతను పెంచుతుంది" అని ఆయన పేర్కొన్నారు.

ఆరోగ్య , కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి , మిషన్ డైరెక్టర్ (ఎన్ హెచ్ ఎమ్) శ్రీమతి రోలి సింగ్, ఎఫ్ పి అండ్ ఎంహెచ్ సలహాదారు డాక్టర్ ఎస్ కె సిక్దార్, , వివిధ అభివృద్ధి భాగస్వాముల ప్రతినిధులు ఈ సదస్సు కు హాజరయ్యారు.

ఎస్ఎన్ ఎల్ పునరుద్ధరణకు 1.64 లక్షల కోట్ల రూపాయల పాకేజిని ఆమోదించిన కేంద్ర కేబినెట్

న్యూఢిల్లీ, జులై 28: టెలికం రంగం వ్యూహాత్మక రంగం. టెలికం రంగ మార్కెట్ ను సమతూకంలో ఉంచడానికి బిఎస్ఎన్ ఎల్ ఉపకరిస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో టెలికం సేవలను విస్తరింపచేయడంలో . విపత్తు సహాయంలో, దేశీయ సాంకేతిక పరిజ్ఞన అభివృద్ధిలో బిఎస్ ఎన్ ఎల్ కీలకపాత్ర పోషిస్తుంది. కేంద్ర కేబినెట్ ఆమోదించిన పునరుద్ధరణ చర్యలు బిఎస్ ఎన్ ఎల్ సేవల స్థాయి పెంపునకు తాజాగా పెట్టుబడిని సమకూర్చడంపైన, స్పెక్ట్రం కేటాయింపు, లాభనష్టాల ఖాతాపై ఒత్తిడి తగ్గించడం, భారత్ బ్రాడ్ బాండ్ నిగమ్ లిమిటెడ్ (బిబిఎన్ ఎల్‌క్స్)ను బిఎస్ ఎన్ ఎల్‌లో విలీనం చేయడం ద్వారా ఫైబర్‌నెట్‌వర్క్‌ను పెంచడం వంటివి ఉన్నాయి.

బిఎస్ఎన్ ఎల్ సేవల స్థాయి పెంపుః

పాలనాపరంగా స్పెక్ట్రమ్ కేటాయింపుః ప్రస్తుత సేవలను మెరుగుపరచడానికి, 4 జి సేవలు అందించడానికి, బిఎస్ఎన్ఎల్‌కు 900 -1800 ఎంహెచ్‌జెడ్ బ్యాండ్‌ను పాలనాపరంగా రూ 44,993 కోట్ల రూపాయలతో కేటాయించనున్నారు. ఈక్విటీ సమకూర్చడం ద్వారా దీనిని కేటాయిస్తారు. ఈ స్పెక్ట్రమ్ తో బిఎస్ఎన్ ఎల్ మార్కెట్ లో పోటీ పడగలుగుతుంది. అలాగే గ్రామీణ ప్రాంతాలలో గల విస్తృతనెట్ వర్క్‌ను ఉపయోగించుకుని హై స్పీడ్ డాటాను అందించగలుగుతుంది.

కాపెక్స్ కు ఆర్థికంగ మద్దతు : దేశీయంగా సాంకేతికత అభివృద్ధిని ప్రోత్సహించేందుకు, బిఎస్ ఎన్ ఎల్ ఆత్మనిర్భర్ 4జి టెక్నాలజీ స్టాక్ ను ఏర్పాటు చేసే ప్రక్రియలో ఉంది. రాగల 4 సంవత్సరాలకు అవసరమయ్యే పెట్టుబడి వ్యయం అవసరాలకు ప్రభుత్వం 22,471 కోట్ల రూపాయల కాపెక్స్‌ను సమకూరుస్తుంది. ఇది ఆత్మనిర్భర్ 4జి స్టాక్ అభివృద్ధి, నిర్వహణకు ఎంతగానో ఉపకరిస్తుంది.

గ్రామీణ ప్రాంత వైర్ లైన్ కార్యకలాపాలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ : వాణిజ్యపరంగా సాధ్యం కానప్పటికీ బిఎస్ ఎన్ ఎల్ గ్రామీణ, మారుమూల ప్రాంతాలలో వైర్ లైన్ సర్వీసులను సమకూరుస్తూ వస్తున్నది. ఇది ప్రభుత్వ సామాజిక లక్ష్యాలను చేరుకోవడానికి ఉపకరిస్తుంది. ప్రభుత్వం బిఎస్ ఎన్ ఎల్‌కు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద వాణిజ్యపరంగా గిట్టుబాటు కాని గ్రామీణ వైర్ లైన్ కార్యకలాపాలకు 2014-15 నుంచి 2019-20 కాలానికి ప్రభుత్వం 13,789 కోట్ల రూపాయలను సమకూరుస్తుంది.,

అధీకృత పెట్టుబడి పెంపు : బిఎస్ ఎన్ ఎల్ అధీకృత పెట్టుబడి ని ఎజిఆర్ బకాయిలు, కాపెక్స్ , స్పెక్ట్రమ్ కేటాయింపునకు బదులుగా 40,000 కోట్ల రూపాయల నుంచి 1, 50,000 కోట్లరూపాయలకు పెంచుతారు.

బిఎస్ ఎన్ ఎల్ లాభనష్టాల ఖాతాపై ఒత్తిడి తగ్గింపు :

రుణ వ్యవస్థీకరణ : దీర్ఘకాలిక రుణాన్ని సమకూర్చుకునేందుకు ఈ పిఎస్ యు లకు ప్రభుత్వం సావరిన్ గ్యారంటీలను సమకూరుస్తుంది. దీనితో ఇవి 40,399 కోట్ల రూపాయల ను దీర్ఘకాలిక బాండ్ల ద్వారా సమకూర్చుకోనున్నాయి. ఇది ప్రస్తుత రుణ పునర్నిర్మాణానికి , లాభనష్టాల ఖాతాపై ఒత్తిడి తగ్గించడానికి ఉపకరిస్తుంది.

ఎజిఆర్ బకాయిలకు ఆర్థిక మద్దతు : లాభనష్టాల ఖాతా ను మరింత మెరుగుపరచడానికి , బిఎస్ ఎన్ ఎల్‌కు సంబంధించి సుమారు 33,404 కోట్ల రూపాయల విలువగల ఎజిఆర్ బకాయిలను ఈక్విటీకిందికి మార్చడం ద్వారా సెటిల్‌చేస్తారు. ప్రభుత్వం ఎజిఆర్, జిఎస్టి బకాయిల ను పరిష్కరించేందుకు నిధులు సమకూరుస్తుంది.

ప్రిఫరెన్స్ షేర్ల తిరిగి విడుదల : బిఎస్ ఎన్ ఎల్ రూ 7,500 కోట్ల రూపాయల మేర ప్రిఫరెన్స్ షేర్లను ప్రభుత్వానికి తిరిగి జారీచేస్తుంది.

బిఎస్ ఎన్ ఎల్ ఫైబర్‌నెట్ వర్క్ పెంపు:

బిబిఎన్ ఎల్, బిఎస్ ఎన్ ఎల్ విలీనం : భారత్ నెట్ కింద గల విస్తృత మౌలిక సదుపాయాలను వినియోగించుకునేందుకు వీలుగా భారత్ బ్రాడ్ బాండ్ నెట్ వర్క్ లిమిటెడ్ (బిబిఎన్ ఎల్)ను, బిఎస్ ఎన్ ఎల్ లతో విలీనం చేస్తారు. భారత్ నెట్ వర్క్ కింద ఏర్పాటుచేసిన మౌలికసదుపాయాలు జాతీయ సంపద అవుతాయి. ఇది అందరు టెలికం సర్వీసు ప్రొవైడర్లకు ఎలాంటి వివక్షతకు తావులేకుండా అందుబాటులో ఉంటుంది.

ఈ చర్యలతో, బిఎస్ ఎన్ ఎల్ ప్రస్తుత తన సేవల నాణ్యతను పెంచుకోవడానికి , 4 జి సేవలు అందించడానికి , ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి వీలుకలుగుతుంది. ఈ పునరుద్ధరణ ప్రణాళికతో బిఎస్ఎన్ ఎల్ 2026-27 నుంచి లాభాలను ఆర్జించగలదని భావిస్తున్నారు.

రాష్ట్రపతిపై కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ.. బీజేపీ శ్రేణుల ఆందోళన

అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలి : బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

కరీంనగర్ , జులై 28: భారత రాష్ట్రపతి, ఆదివాసి మహిళ ద్రౌపది ముర్ముని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుల వైఖరిని ఖండిస్తూ గురువారం బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని తెలంగాణ చౌక్ లో సోనియా గాంధీ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాల సందర్భంగా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నేత రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును కించపరిచే విధంగా మాట్లాడినందుకు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. ఆదివాసి మహిళా అయిన ద్రౌపది ముర్ము రాష్ట్రపతి అభ్యర్థి కావడం కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేక పోయిందని, ఆదివాసి మహిళ అయినా ద్రౌపది ముర్మకు దేశ వ్యాప్తంగా అనేక పార్టీలు మద్దతునిచ్చి ఆమె విజయానికి సహకరించాయని, కాంగ్రెస్ పార్టీ మాత్రం ఆదివాసి మహిళకు మద్దతివ్వకుండా రాజకీయాలు చేసిందని ఆయన దుయ్యబట్టారు.

నేడు రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే పార్లమెంటులో కాంగ్రెస్ ప్రతిపక్ష నేత చే రాష్ట్రపతి పై అర్థరహిత వ్యాఖ్యలు చేయించిందని, ఆ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ కుసంస్కరానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు.

పార్లమెంట్ సభ్యుడి హోదాలోఉన్న కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాష్ట్రపతి గురించి సోయుండి మాట్లాడారా..? లేక వ్యంగంతో అగౌరపరచాలనే మాట్లాడారా ..? రాష్ట్రపతి పేరును అగౌరవ పరిచే విధంగా, అసభ్యకరంగా సంబోధించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ మహిళగా సాటి గిరిజన మహిళ రాష్ట్రపతి అయితే ఆ పార్టీ తరపున ఇచ్చే గౌరవం ఇదేనా ..? ఆదివాసి మహిళ పై కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరుతో ఆ పార్టీకి గిరిజనులపై ఉన్న ప్రేమ, చిత్తశుద్ధి ఎలాంటిదో అర్థమవుతుందన్నారు. రాష్ట్రపతి ద్రౌపది పై కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని, రాష్ట్రపతికి, దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొరటాల శివరామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్లెం వాసుదేవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మాడ వెంకట్రెడ్డి, జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్, జిల్లా ఆఫీస్ సెక్రెటరీ మాడుగుల ప్రవీణ్, జిల్లా మీడియా కన్వీనర్ కటకం లోకేష్, జిల్లా అధికార ప్రతినిధులు బొంతల కళ్యాణ్ చంద్ర, జానపట్ల స్వామి,జెల్ల సుధాకర్, చొప్పరి జయ శ్రీ, బండ రమణారెడ్డి, యెన్నం ప్రకాష్, బండారి గాయత్రి, దుబాల శ్రీనివాస్, ఎండి జమాల్, బల్బీర్ సింగ్, కార్పొరేటర్లు అనుప్, పెద్దపల్లి జితేందర్, నాగసముద్రం ప్రవీణ్, ఆవుదుర్తి శ్రీనివాస్, మంథని కిరణ్, వరాల జ్యోతి, లక్ష్మణరావు, దళిత మోర్చా అధ్యక్షులు సోమిడి వేణు, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎండి పర్వేజ్, కూరపాటి మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4జి మొబైల్ సర్వీసులు చేరుకోనటువంటి గ్రామాలకు 26,316 కోట్ల రూపాయల మొత్తం వ్యయంతో ఆ విధమైనసేవల ను సమకూర్చడాని కి లక్షించిన ఒక ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన మంత్రిమండలి

న్యూఢిల్లీ, జులై 28: ప్రజలు అందరికీ డిజిటల్ సేవల లభ్యం అయ్యేటట్లు చూడడం మరియు సంధానాన్ని సమకూర్చడం అనేవి ప్రభుత్వం యొక్క 'అంత్యోదయ' దృష్టికోణం లో ఒక అంతర్భాగం గా ఉన్నాయి. అయిదు రాష్ట్రాల లో 44 ఆకాంక్షభరిత జిల్లాల లో 7,287 గ్రామాల కు- ఏయే గ్రామాలైతే 4జి మొబైల్ సర్వీసుల కు నోచుకోలేదో - అటువంటి గ్రామాల కు ఆ యొక్క సేవల ను అందించడం కోసం ఉద్దేశించిన ఒక ప్రాజెక్టు కు ప్రభుత్వం కిందటి సంవత్సరం లో ఆమోదాన్ని తెలిపింది.ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2021వ సంవత్సరం లో స్వాతంత్ర్య దినం నాడు ఇచ్చిన ప్రసంగం లో, ప్రభుత్వ పథకాలు దేశం లో అందరికీ చేరాలి అంటూ పిలుపును ఇచ్చారు. దేశవ్యాప్తం గా 4జి మొబైల్ సర్వీసులు ఇప్పటికీ చేరని అటువంటి గ్రామాల కు ఆ తరహా సేవల ను అందించడానికని మొత్తం 26,316 కోట్ల రూపాయలు వ్యయం అయ్యే ఒక ప్రాజెక్టు ను కేంద్ర మంత్రిమండలి ఈ రోజు న ఆమోదించింది.ఈ ప్రాజెక్టు సుదూర ప్రాంతాల లో మరియు దుర్గమ ప్రాంతాల లో 24,680 గ్రామాల కు 4జి మొబైల్ సర్వీసుల ను- వేటికయితే ఆ ప్రాంతాలు ఇంత వరకు నోచుకోలేదో- అందుబాటు లోకి తీసుకు రానుంది. పునరావాసం, సరికొత్త ఆవాసాలు, ప్రస్తుత ఆపరేటర్ లు అందిస్తున్న సేవల ఉపసంహరణ అనే కారణాల తో 20 శాతం గ్రామాల ను అదనం గా చేర్చుకొనేందుకు ఈ ప్రాజెక్టు లో వీలు ఉంది. దీనికి అదనం గా, కేవలం 2జి/3జి సంధాన సదుపాయాన్ని కలిగివున్నటువంటి 6,279 గ్రామాల ను 4జి కనెక్టివిటీ కి ఉన్నతీకరించడం జరుగుతుంది.ఈ ప్రాజెక్టు నుఆత్మనిర్భర్ భారత్ యొక్క 4జి టెక్నాలజీ స్టాక్ ను వినియోగించుకొంటూ బిఎస్ఎన్ఎల్ అమలుపరుస్తుంది. మరి దీనికి అయ్యే డబ్బు ను యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేశన్ ఫండ్ నుంచి వెచ్చించడం జరుగుతుంది.

జూన్ 30న ప్రయోగించిన పిఎస్ఎల్వి-సి53 ప్రయోగం పూర్తిగా అంతర్జాతీయ కస్టమర్ మిషన్

న్యూఢిల్లీ, జులై 28: కేంద్ర సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) సైన్స్ ఉ టెక్నాలజీ; సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) ఎర్త్ సైన్సెస్; ఎంఓఎస్ పిఎంఓ, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్, అటామిక్ ఎనర్జీ మరియు స్పేస్ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ "జూన్ 30, 2022న జరిగిన పిఎస్ఎల్వి-సి53 ప్రయోగం పూర్తిగా అంతర్జాతీయ కస్టమర్ మిషన్. ఇందులో 3 సింగపూర్ ఉపగ్రహాలు ప్రయోగించబడ్డాయి" అని పేర్కొన్నారు.

లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ పిఎస్4 ఎగువ దశ కక్ష్య ప్లాట్‌ఫామ్‌లో భాగంగా టెక్నాలజీ పేలోడ్‌లను హోస్ట్ చేయడానికి భారతీయ అంతరిక్ష స్టార్ట్-అప్‌లకు కూడా ఈ ప్రయోగం అవకాశం కల్పించిందని అన్నారు.

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) పిఎస్ఎల్వి-సి53,డిఎస్-ఈఓ, న్యూసార్ మరియు స్కూబ్-1 అనే మూడు సింగపూర్ కస్టమర్ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించింది. పిఎస్ఎల్వి-సి53 అనేది న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్)కు 2వ వాణిజ్య మిషన్. ఇది డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ (డిఓఎస్) పరిపాలనా నియంత్రణలో ఉన్న సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజ్. తద్వారా అంతర్జాతీయ వినియోగదారులకు లాంచ్ సేవలను అందించడానికి ఎన్ఎస్ఐఎల్ విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదించడానికి వీలు కల్పిస్తుంది. ఇంకా ప్రతి విజయవంతమైన లాంచ్‌తో అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ ప్రయోగ వాహనాల పోటీతత్వం పెరుగుతూనే ఉంది.

ఇస్రో తన వాణిజ్య ఆయుధాల ద్వారా 34 దేశాలకు చెందిన 345 విదేశీ ఉపగ్రహాలను పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్వి)లో విజయవంతంగా ప్రయోగించింది. విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించడం ద్వారా సంపాదించిన మొత్తం విదేశీ మారకపు ఆదాయం సుమారు 56 మిలియన్ అమెరికా డాలర్లు మరియు 220 మిలియన్ యూరోలు.

తిరుమల వెళ్లే భక్తులకు శుభవార్త.. హైదరాబాద్-తిరుమల మధ్య 16 ప్రత్యేక రైళ్లు..

హైదరాబాద్, జులై 28: తిరుపతి వెళ్లే ప్రయాణికులకు రైల్వే శాఖ శుభవార్త అందించింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తిరుపతి-హైదరాబాద్ మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రత్యేక రైలు (07509) ఆగస్టు 6, 13, 20 తేదీల్లో హైదరాబాద్‌లో సాయంత్రం 4.35 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి (07510) రైలు ఆగస్టు 7, 14, 21 తేదీల్లో రాత్రి 11.50 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్ చేరుతుంది. అలాగే మరో రైలు (07433) ఆగస్టు 2, 9, 16, 23, 30 తేదీల్లో హైదరాబాద్‌లో సాయంత్రం 6.40 గంటలకు బయల్దేరి.. మరుసటి రోజు ఉదయం 7.50 గంటలకు తిరుపతి చేరుతుంది. అలాగే 07434 రైలు ఆగస్టు 3, 10, 17, 24, 31 తేదీల్లో సాయంత్రం 5.20 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.40 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. వీటితో పాటు నాందేడ్, తిరుపతి, ఔరంగాబాద్ మధ్య 8 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే శాఖ పేర్కొన్నది. నాందేడ్ ప్రత్యేక రైలు (07633) ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి మరుసటి రోజు (జూలై 31) ఉదయం 8.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. 07634 ఈ నెల 31వ తేదీ రాత్రి 9.10 గంటలకు తిరుపతిలో బయల్దేరి మరుసటి రోజు సాయంత్రం 5.20 గంటలకు నాందేడ్ చేరుతుంది. మరో ప్రత్యేక రైలు ఆగస్టు 7, 14, 21 తేదీల్లో తిరుపతిలో ఉదయం 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు ఔరంగాబాద్ చేరుకుంటుంది. ఔరంగాబాద్ (07638) ఆగస్టు 8, 15, 22 తేదీల్లో రాత్రి 11.05 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని రైల్వే అధికారులు సూచిస్తున్నారు.

దుబ్బ తండ గ్రామపంచాయతీ అభివృద్ధిపై తప్పకుండా సహకరిస్తా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

మహబూబాబాద్, జులై 28 (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం దుబ్బ తండా గ్రామపంచాయతీ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానని పంచాయతి రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తొర్రూరు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ పొనుగోటి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానికులు జాటోత్ సురేష్ నాయక్ , నాలుగవ వార్డు సభ్యులు జాటోత్ శ్రీను నాయక్ లు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుని కలిసి మా గ్రామపంచాయతీ తమరు నిధులు మంజూరు చేస్తున్న కూడా స్థానిక సర్పంచ్ పనులు చేయడంలో అలసత్వం వహిస్తున్నాడని కావున చర్యలు తీసుకుని దుబ్బ తండా గ్రామపంచాయతీనీ అభివృద్ధి పథంలో నడిపించాలని వారు కోరారు. దుబ్బ తండా గ్రామపంచాయతీ పరిధిలోని భీముని తండాకు కనీసం దారి ఏర్పాటు చేయమని పలుమార్లు వేడుకున్న ఫలితం లేకుండా పోయిందని, అట్లాగే భీముడు తండా, మంగలి సాయిలు తండా, దుబ్బ తండాల స్థానికులు మంచినీటి సౌకర్యానికి ఇబ్బంది పడుతున్నామని సర్పంచిని పలుమార్లు కలిసిన కూడా ఏం చేస్తారో చేసుకోండి అని అంటున్నారని మంత్రికి ఫిర్యాదు చేయండి అంటూ బెదిరిస్తున్నాడని, గ్రామపంచాయతీ పరిధిలోని మిగతా తండాల స్థితిగతులపై ఎన్నడూ పరిశీలించి పనులు చేపట్టిన దాఖలాలు లేవని మా గ్రామానికి మంజూరైన సీసీ రోడ్ల పనులలో కూడా మంత్రిగా తమరి ఇచ్చిన నిధులను ఖర్చు చేయడంలో నిర్లక్ష్యం వహించాడని వారు మంత్రి ముందు గోడు వెళ్లబోసుకున్నారు. ఇకనైనా మా గ్రామ పంచాయతీకి మంజూరు అయిన నిధుల విషయంలో తమరు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మా తండాలకు రహదారి తో పాటు మంచినీటి సౌకర్యాలు కల్పించాలని వారు తెలిపారు ప్రస్తుతం భారీ వర్షాల నేపథ్యంలో ఖాళీ ప్రదేశాలలో మురుగునీటి నిలువల తర్వాత బ్లీచింగ్ పౌడర్ చల్లిన దాఖలాలు లేకుండా కూడా పోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అట్లాగే మా గ్రామానికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లులు మంజూరు చేయాలని వారు కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల నాయకులు జాటోత్ సురేష్ నాయక్,నాలుగో వార్డ్ సభ్యులు జాటోత్ శ్రీను నాయక్, మరియు జాటోత్ బిఖ్య నాయక్,రెడ్యానాయక్ జాటోత్, జాటోత్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలపై టీటీడీ సమీక్ష



తిరుమల, జులై 28: తిరుమలలో నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లుపై జిల్లా యంత్రాంగంతో ఈవో ధర్మారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో బ్రహ్మోత్సవాల నేపథ్యంలో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. బ్రహ్మోత్సవాలు జరిగే సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు సర్వదర్శన భక్తులుకు మాత్రమే దర్శనానికి అనుమతి ఇస్తున్నట్లు ఈవో ధర్మారెడ్డి తెలిపారు. సామాన్య భక్తులుకు ప్రాధాన్యత ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. సెప్టెంబర్ 27వ తేదీన ధ్వజారోహణం సందర్భంగా శ్రీవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సిఎం జగన్ పట్టు వస్త్రాలు సమర్పిస్తారని, అక్టోబర్ 1వ తేదీన గరుడ వాహనం, 5వ తేదీన చక్రస్నానం కార్యక్రమం ఉంటుందన్నారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులు పాటు ప్రత్యేక దర్శనాలు రద్దు చేస్తామన్నారు. అక్టోబర్ 1వ తేదీన గరుడ సేవ సందర్భంగా ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలు అనుమతించబోమన్నారు.

జర్నలిస్ట్ కుటుంబానికి అండగా మంత్రి అజయ్

– మెరుగైన వైద్యం కోసం మంత్రి అజయ్ ఆర్థికసహాయం

– రూ. ఒక లక్ష రూపాయల ఎల్వోసీ చెక్కు మంజూరు

ఖమ్మం, జులై 28: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మరోసారి తన మంచి మనసును, ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టు పసుపులేటి సత్యనారాయణ కుటుంబానికి మంత్రి అజయ్ అండగా నిలిచారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. ఒక లక్ష రూపాయల విలువైన ఎల్వోసీ చెక్కును మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మంజూరు చేయించారు.

ఖమ్మం జిల్లాకు చెందిన జర్నలిస్ట్ సత్యనారాయణ సూర్య దినపత్రిక జిల్లా బ్యూరో ఇంఛార్జిగా పనిచేస్తున్నారు. వారు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన నేపథ్యంలో విషయం తెలుసుకున్న మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వెంటనే స్పందించి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకురావాలని సూచించారు అనంతరం ఆస్పత్రి వైద్యులతో ఫోన్ లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి చెప్పారు.

పేద కుటుంబం కావడంతో ఖరీదైన వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉండడంతో జర్నలిస్ట్ కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు దీంతో విషయం తెలుసుకొని తక్షణం స్పందించి సహాయం అందించిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలి.

–సంగారెడ్డి జిల్లా ఎస్పీ రమణ కుమార్.

సంగారెడ్డి జులై 28 (నేటి నిజం ప్రతినిధి) గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా భూపాలపల్లి జిల్లా ఎస్పీ సురేందర్ రెడ్డి ట్విట్టర్ వేదికగా విసిరినా ఛాలెంజ్ ను స్వీకరిస్తూ గురువారం నాడు సంగారెడ్డి జిల్లా ఎస్పీ యం.రమణ కుమార్ జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని, అందుకోసం ప్రతీ ఒక్కరు కనీసం ఒక్క మొక్కను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో యస్.బి. ఇన్స్పెక్టర్ మహేష్ గౌడ్, డి.సి.ఆర్.బి. ఇన్స్పెక్టర్ జేలేందర్ రెడ్డి, ఐ.టి. సెల్ ఇన్స్పెక్టర్ హేమరాణి, ఆర్.ఐ. హరిలాల్, యస్.బి ఎస్.ఐ. యాదవరెడ్డి, డి.సి.ఆర్.బి. ఎస్.ఐ. అంజిరెడ్డి తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.

వ్యవసాయ మోటర్లకు మీటర్లతో కలిగే లాభాలను వివరించండి : ఏపీ సీఎం

అమరావతి, జులై 28: ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ మోటర్లకు మీటర్ల బిగింపు వల్ల కలిగే లాభాలను వివరించేందుకు అధికారులు రైతులకు లేఖలు రాయాలని ఏపీ సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ఇవాళ తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి మోటర్లకు మీటర్లు బిగించి అమలు చేస్తున్న శ్రీకాకుళంలో కలిగిన లాభాలను వివరించాలని సూచించారు.

మీటర్ల బిగింపు వల్ల రైతుపై ఎటువంటి భారం పడదని తెలిపారు. విద్యుత్ బిల్లు అంతా ప్రభుత్వమే చెల్లిస్తున్న విషయాన్ని రైతులకు వివరించాలని పేర్కొన్నారు. వ్యవసాయ పంపుసెట్లకోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే కనెక్షన్లు మంజూరుచేయాలని వెల్లడించారు. థర్మల్ కేంద్రాల వద్ద సరిపడా బొగ్గు నిల్వలు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

పత్తిపాక జలాశయం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయండి : మంత్రి కొప్పుల

కరీంనగర్ , జులై 28: జిల్లాలోని ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలో నూతనంగా నిర్మించనున్న పత్తిపాక జలాశయం నిర్మాణానికి రూపొందించిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

ఈ మేరకు గురువారం కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వరద కాలువ రామచంద్రపురం నుంచి రామడుగు మండలం మీదుగా.. చొప్పదండి మండలం రేవెల్లి నుంచి సుమారు 7 కిలోమీటర్ల కాలువను తవ్వి పత్తిపాక జలాశయానికి అనుసంధానం చేస్తామని తెలిపారు.

దీంతో టీఎంసీ నీటిని తరలించడానికి అవకాశం ఉందని మంత్రికి నీటిపారుదల శాఖ అధికారులు వివరించారు. సుమారు 10,000 ఎకరాలకు సాగునీరు అందించే ఈ జలాశయం నిర్మాణానికి రూ.230 కోట్ల వ్యయం అవుతుందన్నారు. కాగా, నిధుల మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించాలని మంత్రి ఆదేశించారు.

విద్యార్థితో మసాజ్ చేయించుకున్న టీచర్-సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు

న్యూఢిల్లీ, జులై 28: హర్దోయ్ లోని పోఖరి ప్రైమరీ స్కూల్ లో దారుణం చోటు చేసుకుంది. క్లాస్‌రూమ్‌లో దర్జాగా కూర్చొని ఓ విద్యార్థితో మసాజ్ చేయించుకుంది ఓ టీచర్. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. గురువు స్థానంలో ఉండి ఆమె ఇలా చేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

యూపీలోని హర్దోయ్‌లోని పోఖరి ప్రైమరీ స్కూల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఊర్మిళా సింగ్ అనే ఉపాధ్యాయురాలు దర్జాగా కూర్చొని విద్యార్థితో మసాజ్ చేయించుకుంది. దీనికి సంబంధించిన వీడియో బయటకొచ్చింది. ఆ వీడియోలో కుర్చీలో కూర్చున్న టీచర్ ఎడమ చేతికి ఓ విద్యార్థి మసాజ్ చేస్తున్నాడు. పిల్లవాడు చేతికి మసాజ్ చేస్తుండగా ఆ టీచర్ బాటిల్‌తో నీళ్లు తాగుతోంది. క్లాస్‌రూమ్‌లోని మిగతా పిల్లలు ఎవరి పనిలో వాళ్లున్నారు. ఆ స్కూల్లో ఆమె అసిస్టెంట్ టీచర్‌గా పనిచేస్తోంది. ఈ వీడియో బయటకురావడంతో ఉన్నతాధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే ఆ మహిళా టీచర్‌ను సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశాలు జారీ చేశారు.

వేయి కోట్ల రూపాయలకు పైగా విలువ కలిగిన అనేక ప్రాజెక్టులకు సాబర్ కాంతాలోని సాబర్ డెయరిలో ప్రధాన మంత్రి ప్రారంభోత్సవం/శంకుస్థాపన

న్యూఢిల్లీ, జులై 28: వేయి కోట్ల రూపాయల పై చిలుకు విలువ కలిగిన అనేక ప్రాజెక్టుల కు గుజరాత్ లోని సాబర్ కాంతా లో గల గఢోడా చౌకీ లో నెలకొన్న సాబర్ డెయరి లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న ప్రారంభోత్సవం/శంకుస్థాపన లు జరిపారు. ఈ ప్రాజెక్టు లు స్థానిక రైతుల కు మరియు పాల ఉత్పత్తిదారుల కు సాధికారిత ను కల్పించడం తో పాటు వారి ఆదాయం వృద్ధి చెందడం లో దోహదం చేయనున్నాయి. అంతేకాక ఇది ఆ ప్రాంతం లోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కు ఒక ఊతాన్ని కూడా అందించనుంది. ప్రధాన మంత్రి ఈ సందర్భం లో సుకన్య సమృద్ధి పథకం లబ్ధిదారుల ను మరియు పాల ఉత్పత్తి లో అగ్రగాములు గా నిలచిన మహిళల ను సత్కరించారు. ఈ కార్యక్రమాని కి హాజరైన వారిలో గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర భాయీ పటేల్ కూడా ఉన్నారు.

సభికుల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, "ఈ రోజున సాబర్ డెయరి సామర్థ్యం విస్తరిస్తున్నది. వందల కోట్ల రూపాయల విలువ కలిగిన కొత్త ప్రాజెక్టుల ను ఇక్కడ ఏర్పాటు చేయడం జరుగుతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తో కూడిన ఒక పాలపొడి ప్లాంటు ను అదనం గా ఏర్పాటు చేయడం వల్ల, అలాగే అసెప్టిక్ ప్యాకింగ్ సెక్షన్ లో మరొక లైను ను జోడించడం వల్ల సాబర్ డెయరి యొక్క సామర్థ్యం మరింత గా వృద్ధి చెందనుంది" అని వివరించారు. సాబర్ డెయరి వ్యవస్థాపకుల లో ఒకరైన శ్రీ భూదాభాయీ పటేల్ ను కూడా ప్రధాన మంత్రి స్మరించుకొన్నారు. ఈ ప్రాంతం తో, స్థానిక ప్రజల తో తన కు గల సుదీర్ఘ అనుబంధాన్ని సైతం ప్రధాన మంత్రి గుర్తు కు తెచ్చుకొన్నారు.

రెండు దశాబ్దాల కిందట దుర్భిక్షం మరియు ఎద్దడి స్థితి నెలకొనడాన్ని ప్రధాన మంత్రి గుర్తు కు తెచ్చారు. ముఖ్యమంత్రి గా తాను ప్రజల సహకారాన్ని అర్థించిన విషయాన్ని, ఈ ప్రాంతం లో స్థితి ని మెరుగు పరచడానికి చేసిన ప్రయాసల ను గురించి ఆయన ప్రస్తావించారు. పశువుల పెంపకం మరియు పాడి రంగం ఆ ప్రయాసల లో మహత్వపూర్ణమైనవి గా మారాయి అని ఆయన అన్నారు. పశు దాణా, మందులు మరియు పశువుల కు ఆయుర్వేద చికిత్స ను ప్రోత్సహించడం వంటి వాటి ద్వారా పశు సంవర్ధనాన్ని ప్రోత్సహించడం జరిగింది అని కూడా ఆయన అన్నారు. గుజరాత్ జ్యోతిగ్రామ్ పథకం అభివృద్ధి కి ఒక ఉత్ప్రేరకం గా నిలచింది అని ఆయన ప్రస్తావించారు.

గడచిన రెండు దశాబ్దాల లో చేపట్టిన చర్యల కారణం గా గుజరాత్ లో పాడి బజారు ఒక లక్ష కోట్ల రూపాయల కు చేరుకొంది అని ప్రధాన మంత్రి సగర్వం గా వెల్లడించారు. 2007వ సంవత్సరం లోను, 2011వ సంవత్సరం లోను తాను ఈ ప్రాంతాన్ని సందర్శించినప్పటి సంగతుల ను ఆయన తెలియజేస్తూ, మహిళల ప్రాతినిధ్యం అధికం కావాలని అప్పట్లో తాను అభ్యర్థించినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం చాలా వరకు సంఘాల లో మహిళల కు చక్కనైన ప్రాతినిధ్యం ఉందని ఆయన అన్నారు. పాల కు చేసే చెల్లింపులు ఎక్కువ గా మహిళల కే దక్కుతున్నాయి అని ఆయన అన్నారు.

ఈ ప్రయోగాల ను ఇతర ప్రాంతాల లో కూడా ఆచరణ లోకి తీసుకువస్తున్నారు అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రస్తుతం ఫార్మర్ ప్రొడ్యూసర్ అసోసియేశన్స్ (ఎఫ్ పిఒ స్) ను 10,000 సంఖ్య లో ఏర్పాటు చేసేందుకు కృషి పూర్తి స్థాయి లో జరుగుతోంది అని ఆయన అన్నారు. ఈ ఎఫ్ పిఒ స్ ద్వారా చిన్న రైతులు ఫూడ్ ప్రోసెసింగ్, సప్లయ్ చైన్ లతో పాటు విలువ ముడిపెట్టిన ఎగుమతుల తో ప్రత్యక్ష సంధానాన్ని కలిగి ఉండటం సాధ్యపడు తుంది అని ప్రధాన మంత్రి అన్నారు. దీని వల్ల గుజరాత్ రైతులు కూడాను ఎంతో ప్రయోజనాన్ని పొందుతారు అని ఆయన అన్నారు.రైతుల కు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల ను ఇప్పించేటటువంటి వ్యూహం ఫలప్రదం అవుతోందని ప్రధాన మంత్రి అన్నారు. తోట పంట లు, చేపల పెంపకం, తేనె ఉత్పత్తి రైతుల కు చక్కటి ఆదాయాన్ని అందిస్తున్నాయి అని ఆయన అన్నారు. ఖాదీ మరియు గ్రామోద్యోగ్ ల టర్నోవర్ మొట్టమొదటిసారి గా ఒక లక్ష కోట్ల రూపాయల కు మించింది అని ఆయన చెప్పారు. ఈ రంగం లో 1.5 కోట్ల కు పైగా కొత్త ఉద్యోగాలు గ్రామాల లో లభించాయి అని వివరించారు. పెట్రోలు లో ఇథెనాల్ ను కలపడాన్ని పెంచడం వంటి చర్యలు రైతుల కు కొత్త అవకాశాల ను కల్పిస్తున్నాయి అని తెలిపారు. "2014వ సంవత్సరం వరకు చూసుకొంటే, 400 మిలియన్ లీటర్ ల కన్నా తక్కువ ఇథెనాల్ ను దేశం లో మిశ్రణం చేయడం జరిగింది. ప్రస్తుతం ఇది ఇంచుమించు 400 కోట్ల లీటర్ లకు చేరుకొంటున్నది. గడచిన రెండు సంవత్సరాల కాలం లో ఒక ప్రత్యేకమైన ఉద్యమాన్ని చేపట్టడం ద్వారా 3 కోట్ల పై చిలుకు రైతుల కు కిసాన్ క్రెడిట్ కార్డుల ను కూడా మా ప్రభుత్వం ఇచ్చింది" అని ఆయన అన్నారు.

యూరియా కు వేప పూత ను పూయడం, మూతపడ్డ ఎరువుల తయారీ కర్మాగారాల ను తెరవడం, నానో ఫర్టిలైజర్స్ ను ప్రోత్సహించడం, ప్రపంచవ్యాప్తం గా ధరల పెరుగుదల చోటు చేసుకొన్నప్పటికీ తక్కువ ధరల కే యూరియా లభ్యం అయ్యేటట్లు చూడటం వంటి చర్యలు దేశం లోను, గుజరాత్ లోను రైతుల కు లబ్ధి ని చేకూర్చాయి అని ప్రధాన మంత్రి అన్నారు. సుజలాం సుఫలాం పథకం సాబర్ కాంతా జిల్లా లో అనేక తహసీళ్ళ లో నీరు అందేటట్లు చూసింది. అదేవిధం గా జిల్లా లో, సమీప ప్రాంతాల లో సంధానాన్ని ఇదివరకు ఎన్నడు లేనంత గా పెంచడం జరిగింది. రైల్ వే ప్రాజెక్టు లు, ఇంకా హై వే ప్రాజెక్టు లు ఈ ప్రాంతం లో సంధానాన్ని మెరుగుపరచాయి. ఈ సంధానం పర్యటన రంగాని కి సహాయకారి కావడం తో పాటు యువత కు కొలువులు దొరికేటట్లు కూడా చూస్తున్నది అని ఆయన అన్నారు.

'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కు ఉన్న ప్రాముఖ్యాన్ని గురించి ప్రధాన మంత్రి స్పష్టం చేస్తూ, స్థానిక ఆదివాసీ నాయకుల త్యాగాన్ని స్మరించుకొన్నారు. నవంబర్ 15వ తేదీ నాడు వచ్చే భగవాన్ బిర్ సా ముండా గారి జయంతి ని 'జన్ జాతీయ గౌరవ్ దివస్' గా పాటించాలని ప్రభుత్వం ప్రకటించిందని ప్రధాన మంత్రి తెలిపారు. "దేశవ్యాప్తం గా ఉన్నటువంటి ఆదివాసి స్వాతంత్ర్య యోధుల స్మృతి లో ఒక ప్రత్యేక సంగ్రహాలయాన్ని కూడా మా ప్రభుత్వం నిర్మిస్తున్నది'' అని ఆయన అన్నారు. "మొట్టమొదటి సారి గా దేశ పుత్రిక ఒకరు– ఎవరైతే ఆదివాసీ సముదాయం నుంచి వచ్చారో– భారతదేశం లో అత్యున్నతమైన టువంటి రాజ్యాంగ పదవి కి చేరుకొన్నారు. శ్రీమతి ద్రౌపదీ ముర్మూ గారి ని దేశం తన రాష్ట్రపతి గా చేసింది. నూట ముప్పయ్ కోట్ల మంది కి పైగా ఉన్న భారతీయుల కు ఇది ఒక గొప్ప కారణమైనటువంటి ఘడియ" అని ప్రధాన మంత్రి అన్నారు.

సాబర్ డెయరి లో దాదాపు గా రోజుకు 120 మిలియన్ టన్నుల (ఎమ్ టిపిడి) సామర్థ్యాన్ని కలిగి ఉండే ఒక పౌడర్ ప్లాంటు ను ప్రధాన మంత్రి ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం 300 కోట్ల రూపాయల కు పైనే ఉంటుంది. ఈ ప్లాంటు యొక్క లే అవుట్ ప్రపంచ ఆహార భద్రత ప్రమాణాల కు తుల తూగుతుంది. ఇది దాదాపు గా సున్నా స్థాయి ఉద్గారం తో కూడి ఉండి, శక్తి ని చాలావరకు ఆదా చేస్తుంది కూడాను. ఈ ప్లాంటు లో అత్యధునాతనమైనటువంటి మరియు పూర్తి గా యంత్రాల పై ఆధారపడి పని చేసేటటువంటి బల్క్ ప్యాకింగ్ లైను ను సమకూర్చడం జరిగింది

సాబర్ డెయరి లో అసెప్టిక్ మిల్క్ ప్యాకేజింగ్ ప్లాంటు ను కూడా ప్రధాన మంత్రి ప్రారంభించారు. ఒక రోజు లో 3 లక్షల లీటర్ల సామర్థ్యాన్ని కలిగి ఉన్నటువంటి ఈ ప్లాంటు అత్యాధునికమైనటువంటి ప్లాంటు అని చెప్పాలి. దాదాపు గా 125 కోట్ల రూపాయల మొత్తం వ్యయం తో ఈ ప్రాజెక్టు ను రూపుదిద్దడమైంది. ఈ ప్లాంటు లో శక్తి ని అధిక స్థాయి లో ఆదా చేసేటటువంటి మరియు పర్యావరణ హితకరమైనటువంటి సాంకేతిక పరిజ్ఞానం జతపడ్డ అతి ఆధునికమైన ఆటోమేశన్ సిస్టమ్ ఉంది. పాల ఉత్పత్తిదారుల కు మెరుగైన ప్రతిఫలం అందేటట్లు చూడటం లో ఈ ప్రాజెక్టు సహాయకారి కానుంది.

సాబర్ జున్ను మరియు పాల విరుగుడు తేట ను ఎండబెట్టే ప్లాంటు ప్రాజెక్టు నిర్మాణాని కి కూడా ప్రధాన మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు కు అయ్యే వ్యయం దాదాపు గా 600 కోట్ల రూపాయలు అని అంచనా వేయడమైంది. ఈ ప్లాంటు చెడర్ చీజ్ (దీని సామర్థ్యం 20 ఎమ్ టిపిడి), మొజెరెలా చీజ్ (దీని సామర్థ్యం 10 ఎమ్ టిపిడి) లతో పాటు ప్రోసెస్ డ్ చీజ్ (దీని సామర్థ్యం 16 ఎమ్ టిపిడి) ను సైతం ఉత్పత్తి చేస్తుంది. జున్ను ను తయారు చేసే ప్రక్రియ లో వెలికి వచ్చే పాల విరుగుడు తేట ను వే డ్రయింగ్ ప్లాంటు లో ఎండబెట్టడం జరుగుతుంది; వే డ్రయింగ్ ప్లాంటు 40 ఎమ్ టిపిడి సామర్థ్యాన్ని కలిగివుంటుంది.

సాబర్ డెయరి అనేది గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేశన్ (జిసిఎమ్ఎమ్ఎఫ్) లో ఒక భాగం గా ఉంది; ఇది అమూల్ బ్రాండ్ లో భాగం గా పాల ను మరియు పూర్తి శ్రేణి పాల ఉత్పత్తుల ను తయారు చేయడమే కాక విక్రయిస్తుంది కూడా.

కానిస్టేబుల్ టెస్ట్ పోస్టర్‌ని ఆవిష్కరించిన వైరా ఏసిపి : రెహమాన్

– జులై 31న డి.వై.ఎఫ్.ఐ నిర్వహిస్తున్న మోడల్ కానిస్టేబుల్ పరీక్షను అభ్యర్థులందరు సద్వినియోగం చేసుకోవాలి

– వైరా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ యమ్.ఏ.రహమాన్ కానిస్టేబుల్ అభ్యర్థులకు పిలుపు

– వైరా నియోజకవర్గ పరిధిలో మధు జూనియర్ కళాశాలలో పరిక్ష కేంద్రం ఏర్పాటు

– డి.వై.యఫ్.ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల. రమేష్ వెల్లడి

ఖమ్మం, జులై 28: (నేటినిజం ప్రతినిధి): భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పోలీస్ మోడల్ టెస్టులో అభ్యర్థులందరు పాల్గొని సద్వినియోగం చేసుకోగలరని వైరా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ యమ్.ఏ.రహమాన్, కానిస్టేబుల్ అభ్యర్థులకు పిలుపునిచ్చారు.

డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ముద్రించిన మోడల్ కానిస్టేబుల్ పరీక్షకు సంబంధించిన పోస్టర్లను స్థానిక వైరాలోని ఏసిపి కార్యాలయంలో వైరా ఏసిపి యమ్.ఏ.రహమాన్, డి.వై.యఫ్.ఐ నాయకత్వం కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రహమాన్, మాట్లాడుతూ ఈ నమూనా పరీక్షను అభ్యర్థులందరూ ఉపయోగించుకోవాలని, నమూనా పరీక్షలు రాయడం ద్వారా అభ్యర్థులకు అవగాహన పెరుగుతుందని ఆయన అన్నారు. డివైఎఫ్ఐ సంఘం మంచి ప్రయత్నం చేస్తుందని ఈ ప్రయత్నం వృధా కాకుండా అభ్యర్థులందరూ ఎక్కువ సంఖ్యలో ఈ పరీక్షను రాసి ఈ పరీక్షను విజయవంతం చేయాలని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల.రమేష్, మాట్లాడుతూ ఈ నమూనా పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ఈనెల

31 వ తారీకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించినట్లు, వైరా నియోజకవర్గ పరిధిలోని వైరా పట్టణ, రూరల్, కొనిజర్ల, ఇంకా వైరాకి దగ్గరలో ఉన్న వారికి నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సెంటర్ తో పాటుగా ప్రధానమైన ఖమ్మంలో నిర్మల్ హృదయ్ స్కూల్ లో, మధిరలో టి.వి.యమ్ స్కూల్ లో కూడా పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలియజేశారు. కాబట్టి అభ్యర్థులందరూ కూడా ఈ పరీక్షను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రజల ఆరోగ్యం కాపాడడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి గంగుల

కరీంనగర్ , జులై 28: వర్షాలు, వరదలతో వచ్చే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దని, ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.

గురువారం మంత్రి ప్రభుత్వ ప్రధాన దవాఖానను సందర్శించారు. వార్డుల్లో తనిఖీలు చేసారు. రోగులను పరామర్శించి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన చర్యల పై వైద్యాధికారులకు సూచనలు చేసారు. క్యాంటీన్ పరిశీలించి..పలువురికి భోజనాన్ని వడ్డించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో విషజ్వరాలు,డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలకుండా పగడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. జ్వరం వస్తే ప్లేట్ లెట్లు తగ్గడం సాధారణమే.

ప్లేట్ లెట్స్ తగ్గినంత మాత్రానా ప్రజలు భయాందోళనకు గురికావల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో మందులకు కొరత లేదని, ఎలాంటి పరిస్థితులు వచ్చిన

ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్, మేయర్ వై సునీల్ రావు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, జిల్లా ప్రధాన దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జువేరియా, ఆర్ ఎమ్ ఓ డాక్టర్ జ్యోతి, డాక్టర్ అలీమ్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే సీతక్క సహాయం- నిత్యావసరాల వస్తువులు పంపిణీ

ములుగు , జులై 28 (నేటినిజం ప్రతినిధి): వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీలో మునిగిపోయారు ములుగు ఎమ్మెల్యే సీతక్క..వరద బాధితుల సహాయం కోసం వివిధ సంస్థల నుంచి నిత్యావసరాలు సేకరించిన సీతక్క? ఆయా సంస్థల ప్రతినిధులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లారు. వరద బాధితులకు తన వెంట తీసుకెళ్లిన దుప్పట్లు, నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తీసిన ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సీతక్క? దానికి సుదీర్ఘ కామెంట్‌ను కూడా జత చేశారు. మీరెంత సహాయం చేసినా సంతృప్తి కలగకపోవచ్చు కానీ? ఏ సహాయం చేయకుంటే మాత్రం సంతృప్తి అన్నదే దక్కదు అంటూ ఆమె పేర్కొన్నారు. తన పిలుపునకు స్పందించి వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన ఆయా సంస్థలకు ఆమె కృతజ్ఞతలు చెప్పారు.

అమావాస్య రోజున అన్నప్రసాదంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

హైదరాబాద్, జులై 28: హైదరాబాద్ లోని రామంతపూర్ లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతి నెల అమావాస్య రోజున దాదాపు 500 మందికి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్న వారికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోనగిరి శ్రీనివాసులు గుప్తా, సంబు పాండయ్య గుప్తా, శ్రీనివాస్, నగేష్, ప్రకాష్, రమేష్, పబ్బ చంద్రశేఖర్ గుప్తా, సంతోష్, శ్రీకర్, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం తీరు దారుణం: వైసీపీ ఎంపీ

అమరావతి, జులై 28: బీజేయేతర రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిపై కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న తీరు దారుణంగా ఉందని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఆయన వైసీపీ ఎంపీలతో కలిసి మీడియా సమావేశంలో కేంద్ర ప్రభుత్వం తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రాల నుంచి కేంద్రానికి పన్నుల ఆదాయం పెరిగినా రాష్ట్రాలకు మాత్రం సరైన వాటా ఇవ్వడం లేదని ఆరోపించారు.

41 శాతం పన్నుల వాటా ఇస్తున్నామని కేంద్రం చేస్తున్న ప్రచారాల్లో ఏమాత్రం వాస్తవం లేదని వెల్లడించారు. రాష్ట్రాల అప్పుల గురించి మాట్లాడుతున్న కేంద్రం తాను చేస్తున్న అప్పుల సంగతి చెప్పడం లేదని విమర్శిం చారు. ఏపీ ఆర్థిక స్థితిపై కావాలనే బీజేపీ, టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

అభివృద్ధికి ఆకర్షితులయ్యే టీఆర్ఎస్‌లో చేరికలు : ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల . జులై 28: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి టీఆర్ఎస్ చేరుతున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల పట్టణానికి చెందిన జిల్లా చిందు హక్కుల పోరాట సమితి అధ్యక్షులు గడ్డం మధు, బ్యాండ్ యూనియన్ అధ్యక్షుడు గడ్డం శంకర్, పట్టణ 12వ వార్డుకు చెందిన 30 మంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.

వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ అభివృద్ధిలో దూసుకెళుతుందన్నారు. సీఎం కేసీఆర్ జనరంజక పాలన చూసే పలువురు టీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆయన స్పష్టం చేశారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి, పట్టణ పార్టీ అధ్యక్షుడు గట్టు సతీష్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, జిల్లా కౌన్సిలర్ల ఫోరం అధ్యక్షుడు పంబాల రామ్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఫోరం ఉపాధ్యక్షులు బోడ్ల జగదీష్, ఉప్పారి రెడ్డి, పట్టణ ఎస్సీ విభాగం అధ్యక్షుడు మేక పవన్ తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు ఓ సామాజిక విప్లవం : మంత్రి జగదీష్ రెడ్డి

నల్లగొండ. జులై 28: దళిత బంధు పథకం ఓ సామాజిక విప్లవంగా భావించాలని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలో 96 మంది లబ్దిదారులకు దళిత బంధు యూనిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దళిత బంధు లబ్దిదారులకు ఆస్తుల పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు.

స్వాతంత్రానికి ముందు ఉన్న సామాజిక రుగ్మతలను రూపుమాపి అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేయాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. స్వాతంత్రం వచ్చి ఇన్నేండ్లు గడిచినా కుల విక్షత పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దళితులను సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేసి ఆరోగ్యకరమైన సమాజ స్థాపన కోసం సీఎం కేసీఆర్ దళిత బంధు పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధి సమన్వయంతో అర్హులకు దళిత బంధు యూనిట్లను అందజేయాలన్నారు. దళిత బంధు పథకం చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు.

ఏ జి పి గా నియమితులైన గుడిసె సదానందం

రాజన్న సిరిసిల్ల, జులై 28 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏ.జి.పి. అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్) గా నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది గుడిసె సదానందం గత పది సంవత్సరాలుగా న్యాయవాదవృత్తిలో రాణిస్తూ, బార్ అసోసియేషన్ లో ప్రధాన కార్యదర్శి గా బాధ్యతలను నిర్వహిస్తూ, పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పలువురి మన్ననలను పొందారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన వేములవాడ శాసన సభ్యులు డాక్టర్ చెన్నమనేని రమేష్ బాబు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

వేములవాడ ఏరియా ఆసుపత్రి టీమ్‌కు అభినందనలు : జిల్లా మంత్రి శ్రీ కే తారక రామారావు

-ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకులు డా మహేష్ కు మంత్రి ప్రత్యేక ప్రశంస

రాజన్న సిరిసిల్ల, జులై 28 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ ఏరియా దవాఖానలో ఈ నెల 24 వ తేదీన ఒకే రోజు జరిగిన రెండు మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను ఏరియా ఆసుపత్రి డాక్టర్ మహేష్ నేతృత్వంలో విజయవంతంగా పూర్తి చేయడం పట్ల జిల్లా మంత్రి శ్రీ కే తారక రామారావు గురువారం ట్విట్టర్ వేదికగాస్పందించారు.వేములవాడ ఏరియా ఆసుపత్రి టీమ్ కు అభినందనలు అంటూ..

వెల్ డన్ డా మహేష్ కు అంటూ జిల్లా మంత్రి కే తారక రామారావు ట్విట్టర్ వేదికగాప్రశంసించారు. వివరాల్లోకి వెళితేకోనరావుపేట మండలంలో ఎగ్లాస్పూర్ గ్రామానికి చెందిన పిట్టల మల్లవ్వ వయసు (68), మరొకరు వట్టిమల్ల గ్రామానికి చెందిన భుక్య శీల (64) మోకాలు సంబంధించిన జబ్బుతో బాధ బాధపడుతూ ఏరియా ఆస్పత్రికి రావడం జరిగింది. సదరు రోగిని పరీక్షించి వైద్య పరీక్షలు నిర్వహించి మోకాలు కీలు మార్పిడి చికిత్స అవసరమని గుర్తించాము. దీంతో ఆరోగ్యశ్రీ ద్వారా వేములవాడ లోని ఆస్పత్రిలో ఈ చికిత్స ను పూర్తిగా ప్రభుత్వం సహకారంతో ఉచితంగా అందించడం జరిగింది. ఈ శస్త్రచికిత్సలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేష్ రావు ఆధ్వర్యంలో వైద్య బృందం డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ శశి, డాక్టర్ తిరుపతి పాల్గొని విజయవంతం చేశారు.వేములవాడ ఏరియా దవాఖానలో గత 24 వ తేదీన జరిగినఒకేరోజ రెండు మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశాం.

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు జిల్లా మంత్రి కేటీఆర్ , ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు గారిల సహకారంతో రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అనిస్తున్నాని.మంత్రి కే తారక రామారావు ట్విట్టర్ వేదుకగా ప్రశంసించడం మా బాధ్యత మరింతగా పెంచింది ని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేష్ రావుఅన్నారు

IN THE COURT OF THE HONORABLE MVACT-I ADDL CHIEF JUDGE. AT : SECUNDERABAD. O.P.NO 220 of 2021.

Between;
B.Bhagya Naik.
...Petitioner.
AND
Mangali. Ramulu & Others.
...Respondents.

TO,
R1&2.
1.Mangali. Ramulu,
S/O: M.Shanappa,
R/O: H.NO- 12, Block No-26,
Indira Colony,
Tanduru, Vikarabad.
2.Md. Rasheed,
S/O: Md. Hussain,
R/O: H.NO-4-82-1,
Srinivasa Colony,
Gouthapor, Tanduru,
Rangareddy.

Please take notice that the above petitioners have filed the above O.P. for compensation for the injuries sustained by Mr. B.Bhagya Naik, in R.T.A. against you and other Respondents. The above case is posted on **04-08-22,** for your appearance at about 10-30 A.M before the above said court. Hence you are here by called upon to appear before the above said court on the above said time personally or through your counsel. If you are failed to appear the matter will be decided in your absence.

(By the order of the court)
Sri. K.Chandrashekar,
Advocate
Secunderabad.
9290997676

BEFORE THE HON'BLE COMMISIONER FOR EMPLOYEES COMPENSATION AND DEPUTY COMMISIONER OF LABOUR-I TWIN CITIES T.ANJAIAH KARMIKA SANKHEMA BHAVAN, RTC X ROADS, AT:HYDERABAD. E.C NO .69 OF 2018

BETWEEN:
K.SANGA REDDY. And Others
..Appellant
AND
D.Venkat Rao. and Others
...Opposite Parties
To,
1.K.Kavitha,W/o.Late K Ashok Reddy,A/a:21 Years,Occ: House Wife, R/o.H.No.Mirzapur Village,Nyalkal Mandal, Sangareddy Dist
...R3
Mohd.Azmath Pasha,S/o.Jahangeer, Age:Majaor, Occ:Owner Of the Auto bearing No. AP.28 TB 7864 ,R/o.H.No.4-119, Ahmednagar, Shamshabad, Ranga Reddy Dist..

Please take notice that the above named applicant filed E.C. against you and others for compensation praying that the Hon'Ble court for grant of compensa tion in favour of the petitio ners.The Hon'Ble court poste d the above case on **03-08-2022** at 3 P.M. for your appearance either in person or through an advocate failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF THE COURT)
S.RAVI KRISHNA KUMAR,
Advocate
O/o:16-2-147/48/A,Near Chermas,
Opp:Shanthi Fire Works,Malakpet,
Hyderabad

రామప్ప అభివృద్ధికి ప్రభుత్వం కృషి : సందీప్ కుమార్ సుల్తానియా

ములుగు , జులై 28 (నేటినిజం ప్రతినిధి): ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు.

గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్. కృష్ణ ఆదిత్య అధ్యక్షతన 'పాలంపేట స్పెషల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ' తొలి సమావేశాన్ని నిర్వహించారు.

ముఖ్య అతిథిగా ప్రభుత్వ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొని యునెస్కో విధించిన ఎనిమిది అంశాలపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వారసత్వ సంపద గుర్తింపు నిచ్చే క్రమంలో యునెస్కో ఎనిమిది అంశాలలో షరతులతో కూడిన పనులు చేపట్టాలని సూచించిందన్నారు. అందులో మొదటి నిబంధన మేరకు రామప్ప దేవాలయానికి హద్దులు నిర్ణయించడంతోపాటు బఫర్ జోన్ నిర్ణయించాలని పేర్కొన్నట్లు ఆయన వివరించారు.

దీనికోసం పాలంపేట స్పెషల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుచేసి.. కలెక్టరేట్ లో ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అథారిటీ ఆధ్వర్యంలో హద్దులు నిర్ణయించి బఫర్ జోన్లను నిర్ణయించనున్నట్లు ఆయన తెలిపారు.

కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ద్వారా కంబోడియా, థాయిలాండ్, ఇండోనేషియా వంటి దేశాల్లో పర్యటించి రామప్ప దేవాలయంతో పోలిన దేవాలయాలను గుర్తించి పరిశోధన నివేదిక సిద్ధం చేస్తున్నదని తెలిపారు. యునెస్కో నిబంధనల మేరకు రామప్ప దేవాలయ పరిరక్షణకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

రాష్ట్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రణాళికలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రామప్ప సరస్సు సైతం సంరక్షించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కాకతీయ వారసత్వ సంపద గురించి సిబ్బందికి సమాజానికి అవగాహన కల్పించేందుకు వర్కు షాపులను నిర్వహిస్తామన్నారు.

కార్యక్రమంలో ములుగు ఎమ్మెల్యే దనసరి అనసూయ, ఐటీడీఏ పీవో అంకిత్, జిల్లా అడిషనల్ కలెక్టర్లు ఇలా త్రిపాటి, వై వి గణేష్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా హైదరాబాద్, పాలంపేట స్పెషల్ డెవలప్‌మెంట్ అథారిటీ సభ్యులు, కాకతీయ హెరిటేజ్ సభ్యులు పాండురంగారావు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు అవగాహన సదస్సులో పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

మహబూబాబాద్, జులై 28 (నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండల కేంద్రంలోని సాయి గార్డెన్స్ లో మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకులు సమావేశం మరియు దళిత బంధు అవగాహన సమీక్షా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దళిత బంధు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయడం అయినది .

బడుగు బలహీన వర్గాల ఉద్దేశించి దళితులందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందే ఉద్దేశంతో దళిత బందును తీసుక రావడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థానం చైర్మన్ వెనుకదానుల రామచంద్రయ్య శర్మ,ఎంపిపి ఈదురు రాజేశ్వరి, తెరాసా నాయకులు శ్రీరాం సుధీర్,మాజీ మండల అధ్యక్షులు పాలకుర్తి యాదగిరి రావు,మాజీ ఎఫ్ఎసిఎస్ వైస్ చైర్మన్ ముత్తినేని శ్రీనివాస్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్,మండల ఎంపిటిసి ల ఫోరమ్ అధ్యక్షులు ఎదునూరి శ్రీనివాస్ ,మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు ముజీబ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలుక బిక్షపతి, జలగం శేఖర్, సర్పంచులు చింతల భాస్కర్, గాజుల శోభ, ఎంపిటిసిలు ఎర్ర సరిత, ఈరెంటి అనురాధ,నాయకులు కాసాని హరీష్ తదితరులు పాల్గొన్నారు..

అల్ఫోర్స్ రెడ్ ఫెస్ట్ వేడుకలు

కరీంనగర్ , జులై 28: (నేటినిజం ప్రతినిధి): అల్ఫోర్స్ స్థానిక భగత్నగర్లోని అల్ఫోర్స్ ఇ – టెక్నో స్కూల్ లో సృజనాత్మకంగా ఆకర్షనీయంగా ఏర్పాటు చేసినటువంటి అల్ఫోర్స్ రెడ్ ఫెస్ట్ –2022 వేడుకలు ఘనంగానిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాఆల్ఫోర్స్ సంస్థల అధినేత అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి హాజరయ్యారు హాజరై మాట్లాడారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో రంగులు ఒక భాగమని మరియు విభిన్న రంగుల ద్వారా వివిధ విషయాలను సులభంగా తెలుసుకోవచ్చునని మరియు గుర్తుపెట్టుకోవచ్చునని వారు చెప్పారు . రంగులు తెలుసుకోవడం ద్వారా అంశాల మీద పట్టు వస్తుందని మరియు ఘనవిజయాలను నమోదు చేయవచ్చని చెప్పారు . రంగులు జీవితంలో ఆనందాన్ని సమకూరుస్తుందని , వాటి యొక్క అవశ్యకతను తెలుసుకోవడం ద్వారా విభిన్న వస్తువులను తయారు చేయవచ్చని మరియు వ్యక్తిత్వాలను కూడా తెలుసుకోవచ్చని చెప్పారు . రంగుల ద్వారా ఆనందాన్ని మరియు మతసామరస్యాన్ని చాటి చెప్పవచ్చని వారు తెలుపుతూ విభిన్న రంగుల ద్వారా విభిన్న సంస్కృతులకు నాంది వేయవచ్చని చెప్పారు . రంగుల ద్వారా ఎన్నో విషయాలను సులువుగా గుర్తు పెట్టుకోవచ్చని మరియు జీవితాన్ని సైతం ఆనందాయంగా కొనసాగించవచ్చని చెప్పారు . కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి . రెడ్ రెడ్ మై బెస్ట్ రెడ్ " రెడ్ ఓ రెడ్ మై లైఫ్ " " రెడ్ తండర్స్ " పలు నృత్యాలు మరియు నాటికలు ఆకట్టుకున్నాయి . సుమారు 100 మంది విద్యార్థులు ఎరుపు రంగు దుస్తుల్లో విచ్చేసి పండుగ వాతావరణాన్ని కల్పించారు మరియు తరగతి గదులను వివిధ ఎరుపు రంగు వస్తువులతో విచ్చేసారు . విద్యార్థులు పాడిన రెడ్ రైమ్స్ అద్యంతం ఆకర్షనీయంగా నిలిచాయి . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు , తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

వెబ్ ఓఎస్ 4కె స్మార్ట్ టీవీలను 32, 43,50, 55 అంగుళాల వేరియంట్లలో విడుదల చేసిన అకాయ్ ఇండియా

హైదరాబాద్, జులై 28: అకాయ్ తమ నూతన శ్రేణి 4కె, ఎఫ్‌హెచ్‌డీ మరియు హెచ్‌డీ స్మార్ట్‌టీవీలను విప్లవాత్మక వెబ్‌ఓఎస్‌తో విడుదల చేసింది. అకాయ్ శ్రేణి టీవీలు కంటెంట్ అన్వేషణను మరే ఇతర టీవీలలోనూ ఆస్వాదించని రీతిలో ఆస్వాదించే అవకాశం అందిస్తాయి.

మ్యాజిక్ రిమోట్ మరియు థింక్యు ఏఐతో జత కలవడంతో పాటుగా అన్ని రకాల వినోద అవసరాలకూ ఏకైక పరిష్కారంగా నిలుస్తుంది. అలెక్సా కు థింక్యు ఏఐ మద్దతునందించడంతో పాటుగా టీవీ స్ట్రీమింగ్, సెర్చింగ్, బ్రాడ్‌కాస్ట్ ఛానెల్ వీక్షణ అనుభవాలను సైతం సులభతరం చేస్తుంది.అకాయ్ యొక్క 55 అంగుళాల వెబ్‌ఓఎస్ 4కె యుహెచ్‌డీను అత్యంత ఆకర్షణీయంగా 39,990 రూపాయలలో అందిస్తున్నారు. కేవలం 3999 రూపాయల ప్రారంభ ధరతో బజాజ్ ఫైనాన్స్, పైన్‌ల్యాబ్స్, కొటక్ మరియు తదితర బ్యాంక్ భాగస్వాముల నుంచి ఈఎంఐ అవకాశాలు కూడా పొందవచ్చు.అకాయ్ యొక్క వెబ్‌ఓఎస్ స్మార్ట్ టీవీ శ్రేణిలో 55 అంగుళాలు , 50 , 43 మరియు 32 అంగుళాల టీవీ వేరియంట్లు కూడా ఉన్నాయి. ఇవి అత్యంత ఆకర్షణీయంగా మరియు ఆకట్టుకునే రీతిలో ఉండటంతో పాటుగా వినియోగించడానికి అనువైన ఫీచర్లతో ప్రీమియం అనుభవాలను సైతం అందిస్తాయి. అకాయ్ యొక్క వెబ్ ఓఎస్ టీవీలు హెచ్‌డీఆర్ 10 హెచ్‌ఎల్‌జీ ; డాల్బీ ఆడియో, డ్యూయల్ బ్యాండ్ వై?ఫై, 2 వే బ్లూ టూత్ 5.0, స్క్రీన్ మిర్రరింగ్, ఎంఈఎంసీ, 4కె అప్‌స్కేలింగ్, ఏఎల్‌ఎల్‌ఎం, 1.5జీబీ రామ్, 8జీబీ రోమ్‌తో వస్తుంది. వినియోగదారులు ప్రైమ్ వీడియో, నెట్‌ఫ్లిక్స్, జీ5, సోనీలివ్, హాట్‌స్టార్, యాపిల్ టీవీ మొదలైన ఓటీటీలు పొందవచ్చు.అకాయ్ ఇండియా డైరెక్టర్ అనురాగ్ శర్మ మాట్లాడుతూ "అకాయ్ వద్ద మా లక్ష్యం ఎప్పుడూ కూడా మీ జీవితాలకు అదనపు విలువ జోడించడం. ప్రతి రోజూ వినూత్నమైన రీతిలో నూతన ఫీచర్లను కనుగొనడంతో పాటుగా వినోద ప్రపంచాన్ని అన్వేషించడానికి అత్యంత అనువైన ప్రాంగణంగా మారుస్తున్నాము" అని అన్నారు.



టాటా హిటాచీ ఐదు టన్నుల వీల్ లోడర్ జెడ్డబ్ల్యు 225 విడుదల-

హైదరాబాదు, 26 జూలై 2022 : టాటా హిటాచీ ఖరగ్‌పూర్ ప్లాంట్ నుంచి సరికొత్త ఐదు టన్నుల వీల్ లోడర్ జెడ్డబ్ల్యు225ని విడుదల చేసినట్లు టాటా హిటాచీ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ సింగ్ తెలిపారు. జపనీస్ సాంకేతికతతో కూడిన మేడ్–ఇన్–ఇండియా మెషీన్ అన్నారు. మొదటి రెండు మెషీన్‌లను టాటా హిటాచీ కస్టమర్ వీపీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అందజేశామన్నారు. పెట్టుబడిపై రాబడి పరంగా కస్టమర్‌లకు అత్యుత్తమ విలువను అందించడంలో టాటా హిటాచీ నిబద్ధతకు ఉదాహరణ అన్నారు. అత్యాధునిక వినూత్న సాంకేతికతలతో నిండి ఉందన్నారు. ఇంధన సామర్థ్యంపై రాజీ పడకుండా అసాధారణమైన ఉత్పాదకతను అందించగల సామర్థ్యం కలదన్నారు. యంత్రం ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా ఆపరేటర్ సౌలభ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. టాటా హిటాచీ జెడ్ డబ్ల్యు225 అనేది సీఈవీ-ఐవీ ఉద్గార నిబంధనలకు కట్టుబడి ఉండే కమ్మిన్స్ ఇంజిన్‌తో ఆధారితం అన్నారు. పర్యావరణ అవసరాలు, పరిశుభ్రమైన పర్యావరణంపై మా దీర్ఘకాలిక నిబద్ధతకు ఉదాహరణ అన్నారు. సమర్థవంతమైన, శక్తివంతమైన కమ్మిన్స్ ఇంజిన్ దాని సాటిలేని పనితీరుతో ఇంధన ఖర్చులు, నిర్వహణ అవసరాలను తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపారు. టాటా హిటాచీ టీమ్‌కి నిరూపితమైన జపనీస్ టెక్నాలజీతో భారతదేశంలో తయారు చేసిన సరికొత్త ఐదు టన్నుల వీల్ లోడర్ మెషీన్‌ను విడుదల చేయడం చాలా గర్వకారణమని పేర్కొన్నారు. టాటా హిటాచీ అసమానమైన ఉత్పాదకత, విశ్వసనీయత, బహుముఖ ప్రజ్ఞను కలిగి ఉందన్నారు. ఇది వీల్ లోడర్, అభివృద్ధి చెందుతున్న నిర్మాణ మైనింగ్ పరిశ్రమ డిమాండ్‌లకు అనుగుణంగా ఉంటుందన్నారు. కస్టమర్ అవసరాలకు సరిపోయేలా ఆటోమేటిక్ బకెట్ లెవలర్, ఆటో , ఆటోమేటిక్ ఫ్లోట్, ఎయిర్ కండీషనర్ మొదలైన అనేక రకాల జోడింపులు, ఫీచర్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. వెనుక వీక్షణ కెమెరా, ఆటోమేటిక్ సెంట్రలైజ్డ్ లూబ్రికేషన్ సిస్టమ్, ఆటోమేటిక్ ఫైర్ డిటెక్షన్, సప్రెషన్ సిస్టమ్, క్యాబిన్ ఫ్రంట్ గార్డ్ మొదలైన భద్రతా అంశాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇన్‌బిల్ట్ ఇన్‌సైట్ టెలిమాటిక్స్ సూట్‌తో వస్తుందన్నారు. ఇది మొబైల్ ఫోన్‌లలో రోజువారీ వినియోగం, ఇంధన స్థాయి, అలారాలు హెచ్చరికలు వంటి అన్ని సంబంధిత సమాచారాన్ని అందిస్తుందన్నారు. ఎనిమితిబివ వెబ్, యాప్ రెండింటిలోనూ అందుబాటులో ఉందన్నారు.

సబ్బితం జలపాతం వద్ద విషాదం.. నీటిలో మునిగి వలస కార్మికుడి మృతి

హైదరాబాద్, జులై 28: పెద్దపెల్లి జిల్లాలోని సబితం జలపాతం వద్ద విషాదం చోటుచేసుకుంది. ఈరోజు జలపాతం వద్దకు వెళ్లిన రాజస్థాన్ కు చెందిన వలస కార్మికుడు నీటిలో మునిగి మృతిచెందాడు. 18 మంది వరస కార్మికులు జలపాతం చూసేందుకు వెళ్లి స్నానాలు చేస్తుండగా రాజస్థాన్ కు చెందిన సర్వన్ (25) నీటిలో మునిగి మృతిచెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. సర్వన్ పొట్టకూటి కోసం పెద్దపల్లిలో రేలింగ్ పనులు నిర్వహిస్తున్నాడని స్నేహితులు తెలిపారు. సమాచారం అందుకున్న బసంత నగర్ ఎస్ఐ మహేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

వివాహ వేడుకకు హాజరైన వక్ఫ్ బోర్డు చైర్మన్ మసి ఉల్లాహ్, సిపి సత్యనారాయణ

కరీంనగర్ , జులై 28: (నేటినిజం ప్రతినిధి): నగరంలోని వీ.కన్వెన్షన్ లో మానకొండూర్ వాస్తవ్యులు..మొహిద్దిన్స్ కుటుంబ వారసులైన ఉమ్మేజర్, షోయబ్ తహెవర్ ల వివాహ వేడుక బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర బోర్డ్ వర్క్ వక్ఫ్ బోర్డు చైర్మన్ మస్సి ఉల్లా ఖాన్, కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, ఎంఐఎం కార్పొరేటర్లు అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, బర్కత్ అలీ, ఆతిన, అలిబాబా, అజర్ దబీర్, ఎంఐఎం నాయకుడు మొయిజుద్దీన్ ఖాద్రి, మిలాద్ కమిటీ అధ్యక్షుడు మౌలాన అలీమోద్దీన్ నిజామి, అంజద్ ఖాన్ ముజ్జు, సుప్రీం జావిద్ తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

హత్య కాదు.. యాక్సిడెంట్ : ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్, జులై 28(నేటినిజం ప్రతినిధి): యువత మద్యానికి బానిస కావద్దని మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. కౌడిపల్లి వద్ద ఈ నెల 22న జరిగిన రోడ్డు ప్రమాదం గురించి నర్సాపూర్ పోలీసుస్టేషన్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంగా రెడ్డి జిల్లా కల్పగూర్ గ్రామానికి చెందిన చింతల మనోహర్, పవన్ కుమార్, వెంకట్రామ్ ముగ్గురు ఇంజనీరింగ్ పూర్తి చేసి సాఫ్ట్ వెర్ ఉద్యోగులుగా స్థిరపడ్డారు. అంత ముప్పై సంవత్సరాల లోపువారే. మద్యం ఫుల్ గా తాగి మద్యం మత్తులో కారు నడుపుతూ సంగారెడ్డి నుంచి నర్సాపూర్ కు వచ్చారు. నర్సాపూర్ లో ఆగి బిర్యాని తిని సిద్దిపేటలో మిత్రుడి ఇంటి నిర్మాణ పనులను చూడటానికి బయలు దేరారు. కౌడిపల్లి వద్ద పాపన్నపేట్ మండల చికోడు గ్రామానికి చెందిన లింగంపల్లి రాజు 32 రోడ్డుపై కూర్చున్నాడు. మద్యం మత్తులో కారును అతివేగంగా నడుపుతూ రాజును ఢీ కొట్టగా.. అక్కడికక్కడే మృతి చెందారు. అదే వేగంతో కారును ముందుకు నడిపారు. రాజు శరీర భాగాలు తుకుతుకు అయ్యాయి. కొద్ది సేపటికి కారును మల్లుపుకొని వచి చూసి అలాగే ముందుకు పోయారు. దీని పోలీసులు అక్కడ ఉన్న ఆనవలను చూసి హత్య కేసుగా నమోదు చేశారు.

ఈ హత్యను చేధించడంలో తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డితో పాటు సీఐ షేక్ లాల్ మదర్, కౌడిపల్లి ఎస్ఐ శివ ప్రసాద్ రెడ్డి తమ సిబ్బంది తో సీసీ కెమెరాల ఆధారంగా ఛేదించారు. మొదటగా కారు నెంబరును తెలుసుకొని కారు యజమాని అల్వాల్ సత్యనారాయణ ను విచారించగా ఈ కేసు వివరాలు పూర్తిగా తెలుసుకొని చింతల మనోహర్, పవన్ కుమార్, వెంకట్రామ్ ను విచారించగా ఈ కేసు ఛేదించడం జరిగింది. ఈ మేరకు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐ షేక్ లాల్ మదర్, ఎస్ఐ శివ ప్రసాద్ రెడ్డి, పోలీస్ సిబ్బంది రాము, బాగయ్య, పోచయ్య, రాజు, దుర్గ రెడ్డి, ఎస్.కె.అలీలను జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అభినందించారు.

అత్యంత అరుదైన జన్యుపరమైన లోపంతో బాధపడుతున్న వ్యక్తికి విజయవంతంగా కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేసిన పేస్ హాస్పిటల్స్

హైదరాబాద్, జులై 28: పేస్ హాస్పిటల్స్ బృందం విజయవంతంగా అత్యంత అరుదైన జన్యుపరమైన లోపం అలగిల్లీసింద్రోమ్(ంశ్రీజీణతిశ్రీశ్రీవ ూాఎనిటతీనీఎవ)తో బాధపడుతున్న 8 సంవత్సరాల బాలునికి కాలేయ మార్పిడి శస్త్రచికిత్సను చేసింది."అత్యంత అరుదైన జన్యుపరమైన రుగ్మత అలగిల్లీ సింద్రోమ్. ఒక లక్ష జననాలలో సరాసరిన ఒకరికంటే తక్కువ మందికి మాత్రమే ఇది సంభవిస్తుంది. ఈ అరుదైన స్థితిలో కాలేయం లోపల బైల్ డక్ట్ (పిత్త నాళాలు) కెనాల్ సిస్టమ్ అభివృద్ధి చెందదు. దీనివల్ల కాలేయం మరియు రక్తంలో పిత్తరసం చేరుతుంది. ఈ కారణంగా కామెర్లు, తీవ్రమైన దురద వస్తాయి. తదనంతర కాలంలో కాలేయం విఫలమూ అవుతుంది. తల్లిదండ్రుల జన్యువులలో ఎవరి జన్యువులలో అయినా రహస్యంగా ఇది ఉంటే అది పిల్లలకు బదిలీ అయ్యే అవకాశం కూడా ఉంది. చిన్నారుల ఎదుగుదలపై కూడా ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ ఎనిమిది సంవత్సరాల చిన్నారి కేవలం 12కేజీలు మాత్రమే బరువు ఉండటంతో పాటుగా 185 సెంటీమీటర్ల ఎత్తు మాత్రమే ఉన్నాడు. నిజానికి అతని వాస్తవ బరువు 28 కేజీలు ఉండాలి. అందువల్ల ఈ చిన్నారి చాలా బలహీనంగా ఉండటం వల్ల కాలేయ మార్పిడి చేయడం అత్యంత ప్రమాదకరం" అని చీఫ్ హెపటాలజిస్ట్ డాక్టర్ గోవింద్ వర్మ అన్నారు."తన కుమారునికి తన కాలేయంలో కొంత భాగం దానమివ్వడానికి అతని తండ్రి ముందుకు వచ్చాడు. ఇది అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స. ఈ చిన్నారి పూర్తి బలహీనంగా ఉండటంతో పాటుగా కాలేయానికి సరఫరా చేసే పోర్టల్ వీన్ మూసుకుపోయింది. అతనికి అత్యంత క్లిష్టమైన పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు అవసరం ఉంది" అని డాక్టర్ ఆర్ ఫణి కృష్ణ, ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ అన్నారు.అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స కావడంతో పాటుగా రోగి చాలా బలహీనంగా ఉన్నప్పటికీ మా ట్రాన్స్‌ప్లాంట్ టీమ్ యొక్క ప్రయత్నాలు, ఐసీయు మరియు నర్సింగ్ బృందం యొక్క అంకిత భావం కారణంగా చిన్నారి ఎలాంటి అవాంతరాలు లేకుండా కోలుకున్నాడు మరియు మూడవ వారంలో అతనిని డిశ్చార్జ్ చేశాము. శస్త్రచికిత్స చేసిన ఆరు వారాల తరువాత అతను మెరుగ్గా కోలుకున్నాడు మరియు అతని జీవితంలో తొలిసారిగా దురద, కామెర్ల బాధ నుంచి ఉపశమనం పొందాడు."గత మూడు వారాల కాలంలో అతను ఒక కేజీ బరువు పెరిగాడు. రాబోయే కొద్ది సంవత్సరాలలో అతను తన వయసుకు ఉండాల్సిన ఎత్తు , బరువు పెరగగలడని ఆశిస్తున్నాము" అని డాక్టర్ ధీరజ్ అగర్వాల్, కన్సల్టెంట్ హెపటాలజిస్ట్ అన్నారు. పేస్ ట్రాన్స్‌ప్లాంట్ టీమ్‌లో డాక్టర్ గోవింద్ వర్మ, డాక్టర్ ధీరజ్ అగర్వాల్, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ ఆర్ ఫణి కృష్ణ, డాక్టర్ సురేష్ కుమార్ మరియు డాక్టర్ సంతోష్ కుమార్ ? ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్స్ మరియు డాక్టర్ హరీష్, డాక్టర్ మానస ? అనస్తీషియా మరియు ఐసీయు టీమ్ డాక్టర్ ప్రియాంక, పీడియాట్రిషియన్ ఉన్నారు." మా అబ్బాయి బలహీనంగా ఉండటంతో పాటుగా బరువు బాగా తక్కువగా ఉండటం వల్ల మేము చాలా భయపడ్డాను. ట్రాన్స్‌ప్లాంట్ లాంటి సర్జరీకి అతను తట్టుకోగలడా లేదా అన్నది మాకు చాలా భయంగా ఉండేది. కానీ డాక్టర్లు, నర్సుల అంకిత భావం, వారి కష్టం కారణంగా అతనికి పునర్జన్మ వచ్చింది. అతను కామెర్ల బారిన పడకుండా ఉండటం ఓ అద్భుతంగా ఉంది. అతని జీవితంలో తొలిసారిగా అతను దురదలు లేకుండా ఉండగలిగాడు" అని అతని తల్లి అన్నారు."అతి బలహీనమైన, సున్నితమైన చిన్నారికి అత్యంత క్లిష్టమైన కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయడం మా మల్టీ డిసిప్లీనరీ బృందం యొక్క విజయవంతమైన నైపుణ్యాలు, పేస్ హాస్పిటల్స్ వద్ద ఉన్న అత్యాధునిక సదుపాయాలకు ఉదాహరణగా నిలుస్తుంది" అని సీఈఓ ఆర్‌పీ సింగ్ అన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.